జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 10 పక్షపత్రిక మే 16-31, 2017





'పౌర సేవల' చట్టం కోసం పోస్టు కార్డు ఉద్యమం

## దేశ విజయాలుగా మారలేని ఎన్నికల విజయాలు

(మూడేళ్ల పాలన - మో 'డీకోడ్')



## 'చేతులు శుభ్రం చేసుకోవటం'... నేర్పించటానికి వందల ఏళ్లుగా పోరాటం







# నగరాలు, గ్రామాల నిజమైన ప్రాతినిధ్యం కోసం ప్రజాస్వామిక వికేంద్రీకరణ

'నగరాలు, గ్రామాల నిజమైన ప్రాతినిధ్యం కోసం ప్రజాస్వామిక వికేంద్రీకరణ' పై లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ న్యూఢిల్లీ ఎన్‌సీఆర్ సోనెపట్ వద్ద నున్న ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో ప్రసంగించారు. స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జేపీ ప్రసంగం వీడియోని www.twitter.com/jp_loksatta,www.facebook.com/jploksatta లో చూడవచ్చు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మే 16 -31, 2017

సంపుటి - 8 సంచిక - 10

## లోపలి పేజీల్లో...

దేశ విజయాలుగా మారలేని............... 5

రాజకీయ సంస్కరణలు-ఎన్నికలు..........13

డాక్టర్లు-ఇండియా-అమెరికా...............18

చేతులు శుభ్రం చేసుకోవటం.............. 23

కళాశాలల్లో 'సి' చిచ్చు....................... 25

వైద్యం... దైవకార్యం........................ 28

పోలవరం... కాయ్ రాజా కాయ్........ 29

ఉత్తరాంధ్ర యువత ఉపాధిపై నిర్లక్ష్యం... 31

ఎట్టకేలకు రహదారి భద్రతా చట్టం....... 32

పౌరసేవల చట్టం కోసం పోస్టుకార్డు..... 33

జమిలి ఎన్నికలు కాదు... ఎన్నికల ......... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# 'వ్యవస్థలు' ఈదేశానికి రాముని మించిన రక్ష!

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పలుచోట్ల ఓటుకు రూ.750, తమిళనాడు ఆర్కేనగర్ ఉప ఎన్నికలో ఒక్క అధికార పార్టీ నుంచే రూ.4,000, ఆంధ్రప్రదేశ్ గుడివాడలో ఏ అధికారాలు లేని ఓ మునిసిపల్ వార్డు ఉప ఎన్నికలో ఓటుకు రూ.15,000 (రెండు ప్రాచుర్య పార్టీలూ కలిపి) అంటూ ఓటుకు నోట్ల లెక్కలు 'పెద్ద నోట్ల రద్దు' పరిమితుల్ని వెక్కిరిస్తున్నట్టు చెబుతుండగానే.. ఇంకా పెద్ద దిగ్భ్రాంతికర వార్త ఎన్నికల కమిషన్ వైఫల్యంపై వచ్చింది. ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో అన్నా డీఎంకే ఎన్నికల గుర్తు 'రెండాకులు' కోసం ఎన్నికల సంఘం కార్యాలయానికి కోట్లాదిరూపాయలు లంచం సమర్పించినట్టు సమాచారం. లోగుట్టు లోపాయికారీగానైనా ముమ్ముందు తెలుస్తుంది. కానీ ఈ ఆరోపణకు ప్రాథమిక సాక్ష్యాధారాలున్నట్టు అర్థమవుతోంది. నేను ఆశావాదిని. అందుకే.. మార్పులు నెమ్మదిగానే వస్తున్నా, నలభై ఏళ్లకు పైబడి అదే ఆర్తితో, అదే సృజనాత్మకతతో మౌలిక సంస్కరణల కోసం పనిచేయగలుగుతున్నాను. ఎన్నికల సంఘంలో పైస్థాయిలో ఇలా జరగటం నాలోని ఆశావాదాన్ని దెబ్బతీసే ఆందోళనను నిద్రలేపింది. ఈ అవినీతిని అంత తేలిగ్గా తీసుకోలేం. ఎన్ని లోపాలున్నా.. ఓటు ద్వారా శాంతియుతంగా అధికార మార్పిడి జరుగుతూండటం మనదేశంలో పెద్ద విజయం. నూతన ప్రజాస్వామ్యశక్తులుగా పెద్ద ఆశలతో ఆవిర్భవించిన అనేక దేశాలు గత యాభై ఏళ్లలో ఎంతో వేగంగా నియంతృత్వ శక్తుల, సైనిక తిరుగుబాట్ల గుప్పెట్లోకి వెళ్లిపోయాయి. కానీ, వరస ఎన్నికలను జరుపుకుంటూ, స్థిరమైన, శాంతియుతమైన ప్రజాస్వామ్యాన్ని కొనసాగిస్తున్న దేశంగా.. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్వతంత్రం పొందిన దేశాలన్నిటిలోకీ భారత్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇందులో మన ఎన్నికల సంఘం పోషిస్తున్న పాత్ర కీలకం. ఎన్నికల కమిషనర్ల నియామకాల్లో పార్టీల జోక్యం, శాంతిభద్రతల సమస్యలు వంటి ఎన్ని సవాళ్లున్నా.. రాజ్యాంగబద్ధ సంస్థగా మన ఈసీ చాలామేర ప్రశంసనీయ పనితీరుని కనబరిచింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడే అందరికీ వయోజన ఓటు హక్కును ఇచ్చిన మనదేశంలో.. భిన్నత్వం, పేదరికం, అవిద్య వల్ల ఎన్నికల నిర్వహణ విఫలమవుతుందని ఎదురుచూసిన పలు దేశాలకు ఈసీ పనితీరు గట్టి జవాబే ఇచ్చింది. పార్టీల మేనిఫెస్టోలలో అసంబద్ధ హామీల్ని కట్టడిచేయటం, పోస్టాఫీసుల్లో ఓటరు రిజిస్ట్రేషన్లను (లోక్‌సత్తా వల్ల వచ్చిన పైలెట్ ప్రాజెక్టు) నీరుగార్చటం, పార్టీలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యేలా టెలివిజన్ డిబేట్ల ఏర్పాటు వంటి విషయాల్లో ఈసీ మూర్ఖత్వాన్ని ఓ పార్టీ వ్యవస్థాపకునిగా నేనూ ఎదుర్కొన్నాను. అయినా కూడా మన ఈసీ పనితీరు ప్రశంసార్హమైనదనే భావిస్తాను. ఈ దేశంలో ఓటు, భావప్రకటనా స్వేచ్ఛను సక్రమంగా వినియోగించుకుంటే చాలు, అద్భుతమైన మార్పులు వస్తాయనే అవగాహనతోనే.. లోక్‌సత్తా ఉద్యమం సుదీర్ఘ కార్యక్రమంగా (2000-05) ఓటరు జాబితాల ప్రక్షాళనను చేపట్టింది. ఓటుకు- తాము కట్టే పన్ను డబ్బులకు మధ్య సంబంధం అర్థమైతే చాలు, భారత్‌లో నిజమైన విప్లవం వచ్చి వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు వచ్చేస్తాయి. లోక్‌సత్తా కృషి వల్లే ఓటరు జాబితాల్లో అవకతవకలు పట్టణ ప్రాంతాలలో 40 నుంచి 15.9 శాతానికి, గ్రామీణ ప్రాంతాలలో 15 నుంచి 5శాతానికి తగ్గింది. దీన్నే ఈసీ జాతీయ కార్యక్రమంగా చేసి, ఓటరు జాబితాల సవరణను నిరంతర కార్యక్రమంగా మార్చింది. కొనసాగింపుగా.. ఓట్ల కొనుగోలు, ఫిరాయింపులు వంటి ఇతర జాడ్యాలను నిర్మూలించేందుకు దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, స్థానిక స్వయంపాలన వంటి సంస్కరణలకోసం కూడా ఉన్న ఎన్నికల వ్యవస్థ నుంచే లోక్‌సత్తా పోరాడుతోంది. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘంపై పెద్దస్థాయి అవినీతి ఆరోపణ కొంత ఆందోళన కలిగించింది. మన శాసన, ప్రభుత్వ, న్యాయవ్యవస్థలు విఫలమయ్యాయని నరేంద్ర మోదీ ప్రధానిమంత్రి అయి మూడేళ్లయ్యాక కూడా విస్పష్టంగా చెప్పాల్సివస్తోంది. ఈసీ కూడా ఈ జాబితాలోకి రావొచ్చని తమిళనాడు కేసు రుజువుచేస్తోంది. మనదేశంలో వ్యక్తిగత నిజాయతీకి లోటు లేదు. మన కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. వ్యక్తిగతంగానూ, మన కుటుంబంలోనూ ఏ సమస్య వచ్చినా మనలో చాలామందిమి నాయకత్వ లక్షణాలను పెంచుకుని మరీ పరిష్కరించుకుంటాం. కానీ వ్యవస్థల నిర్మాణంలో మాత్రం మన నిజాయతీ, సామర్థ్యాలు ఘోరవైఫల్యం! వ్యవస్థల్లోని సుప్రసిద్ధ భారతీయులు సైతం వ్యక్తిగత నిజాయతీపరంగా ఎక్కువ గుర్తింపు పొందారు తప్ప.. వ్యవస్థీకృత నిజాయతీపరంగా వారిలో పలువురు చేసింది చాలా స్వల్పం. ఒక ఆధునిక ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వం ఏం చేయాలి, ప్రజలకు పుట్టుకతో ప్రకృతి ఇచ్చిన స్వేచ్ఛను పరిరక్షిస్తూ, వారిలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేయటం కోసం వ్యవస్థల నిర్మాణం ఎలా చేయలి.. అనే అవగాహన మన రాజకీయాలలో, సమాజంలో ఇప్పటికీ కొరవడింది. రాజ్యం ఒక ఉమ్మడి ఒప్పందం అని మర్చిపోయి ఉదార ప్రజాస్వామిక విలువలకు బదులుగా ఆధిపత్య ధోరణుల వైపు ఆకర్షితులమవుతున్నాం. దీనివల్ల కోట్లాదిమంది శక్తిసామర్థ్యాలు వృధాగా పోతున్నాయి. అత్యధికశాతం ప్రజలు జీవనభద్రత లేక ముడుచుకుపోయి నివారించదగ్గ బాధలకు కన్నీరు కారుస్తున్నారు. ఓ చారిత్రక అవకాశాన్ని అందుకున్న నరేంద్ర మోదీ కూడా దురదృష్టవశాత్తూ వ్యవస్థల ప్రాధాన్యతను గుర్తించకుండా.. వ్యక్తిగత నిజాయతీకే పరిమితమవుతున్నారు. పరిణతి చెందిన ప్రజాస్వామ్యదేశాలలో వ్యవస్థలు పటిష్టంగా రూపుదిద్దుకోవటం వల్ల.. ఎదిగే అవకాశాలు సామాన్యులకు సైతం అందుబాటులోకొచ్చాయి. కానీ అక్కడ వ్యవస్థ పేరుతో మానవీయ బాంధవ్యాలను విస్మరించటం వల్ల యాంత్రికజీవనం ఇతర సమస్యలకు దారితీస్తోంది. కుటుంబంలో సమస్యల్ని తీర్చటానికి పోలీసు పహరాలు పెడుతున్నారు. మనదేశంలో ఎన్ని గొడవలున్నా, పోలీసు పహరా కంటే మెరుగ్గా భరోసా ఇచ్చే కుటుంబ సంస్కృతి చాలా ఇళ్లల్లో ఉంది. మన కుటుంబ బలాన్ని, పాలనా వ్యవస్థల బలంతో జోడించే బాధ్యతను నెరవేర్చకుండా.. పిల్లల్ని ఎప్పటికీ ఎదగనివ్వని కుటుంబపెద్దలా వ్యవహరించటం వల్ల మోదీ చివరికి ఈ దేశానికి లాభం కంటే ఎక్కువ నష్టం చేసినవారవుతారు. మందిరం, మసీదు నిర్మాణం కన్నా.. విలువలతో కూడిన వ్యవస్థల నిర్మాణం మీద మన చర్చ ఉండాలి. వ్యవస్థలు మనదేశానికి రాముని మించిన రక్ష అని పాలకులు, సమాజం గుర్తించాలి.

మీ

# కార్టూన్ కార్నర్



## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రూ. 10 ,*
*ఏడాది చందా : రూ. 200*
*మూడేళ్ళ చందా : రూ. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# దేశ విజయాలుగా మారలేని ఎన్నికల విజయాలు

## (మూడేళ్ల పాలన - మో'దీకోడ్')

**2014, మే .. భారత ప్రధానమంత్రిగా మోదీ ప్రమాణస్వీకారం**

**2017, మే .. ప్రధానిగా మోదీ పాలనకు మూడేళ్లు**


**2014లో భారతదేశం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు. - 2017లో మౌలిక సమస్యలు.. తేడా ఏమీ లేదు!**

**మోదీ పదవీకాలం ఇంకొంతకాలం ఉంది కాబట్టి, అప్పటికైనా దేశ మౌలిక సమస్యలు తీరే అవకాశముందా?.. లేదు!**

**అంటే.. మూడేళ్ల పాలనలో మోదీ ఎన్నికల విజయం ఈ దేశ నిజ విజయంగా మారలేదు.**

**దేశంలో మౌలిక సమస్యలు మోదీకి ముందూ ఉన్నాయి, మోదీకి తర్వాతా కొనసాగే అవకాశముంది.**

**కాబట్టి.. మోదీని సమస్యగా చూడకుండా, ఈ దేశంలో అసలైన సమస్యల పరిష్కారానికి ఏం కావాలి? దానికి ఇప్పుడు మోదీ చేత ఏం చేయించాలి? అన్న అంశాల మీదే దృష్టి పెట్టటం.. మోదీ మూడేళ్ల పాలన సమీక్షను ఎక్కువ ప్రయోజనకరం చేస్తుంది.**



అధికారం అంటే సాంప్రదాయంగా ఉన్న లాలస, మోజు వల్ల ఎన్నికల్లో ఎవరు గెలిచారు అనే విషయానికి ఇచ్చిన ప్రాధాన్యతను 'ఎలా గెలుస్తున్నారు, గెలిచాక ఏం చేస్తున్నారు' అనే అంశాలకు ఒక దేశంగా, సమాజంగా మనం ప్రాధాన్యత ఇవ్వటం లేదు. ఫలితంగా కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్నికలు క్రమం తప్పకుండా జరుగుతున్నా.. వాటంతటవే వచ్చే సాధారణ మార్పులు, కొన్ని ప్రతికూల మార్పులే తప్ప సానుకూల మార్పులు మన జీవితాల్లో రావాల్సినంత వేగంగా రావటం లేదు. దీనివల్ల దేశ జనాభాలో అత్యధికశాతానికి పెరుగుతున్న యువత తీవ్రంగా నష్టపోయే ఆందోళనకర పరిస్థితులు ఇంకా ఇంకా పెరుగుతున్నాయి.

ఎన్నికల్లో గెలిచినవారు మాత్రమే సర్వాధికారులు, ఐదేళ్లకోమారు వచ్చే ఎన్నికల రోజు మాత్రమే ఓటర్లు సార్వభౌములు అని భావించటం అపరిపక్వ ప్రజాస్వామ్యమనటంలో సందేహం లేదు. భావప్రకటనా స్వేచ్ఛ, పౌరసత్వం, ప్రపంచ పరిణామ క్రమం గురించి, అందులోనూ యువశక్తి, సాంకేతికశక్తి కలగలిసిన దశలో, తెలిసినవారెవరూ.. ప్రభుత్వమే సర్వస్వం అనరు. అదేసమయంలో.. ఎన్నికల్లో గెలుపును కూడా తక్కువ చేసి చూడలేం. లక్ష్యాన్ని చేరుకోవటానికి వేగవంతమైన మార్గం - ఎన్నికల్లో గెలవటం! అందుకే లోక్‌సత్తా కూడా ఎన్నికల్లో గెలుపు కోసం శాయశక్తులా ప్రయత్నించింది. కొంత విరామం తర్వాత కూడా ఏదోకరూపంలో ప్రయత్నించే అవకాశముంది. కానీ అధికారం మార్గం కాదు, లక్ష్యం అని ఒక సమాజంగా, రాజకీయ వ్యవస్థగా ఎప్పుడైతే భావిస్తావున్నామో, ఎన్నికల విజయాలు దేశవిజయాలుగా మారకుండా పోతున్నాయి. ఎన్నికల్లో గెలుపుకి - దేశ ప్రయోజనాలకీ సంబంధం ఉన్నకొద్దీ తగ్గిపోనారంభించింది. ఈ క్రమంలో పౌరసమాజాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను కూడా అడ్డుకునే ప్రయత్నం.. పరిస్థితులను మరీ దిగజారుస్తోంది. ఎన్నో ఆశల మధ్య 2014 మే మాసంలో ఓ చారిత్రక ప్రజాతీర్పుతో బీజేపీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోదీ కూడా తనదైన హిందూత్వ+జీడీపీ అభివృద్ధి శైలిలో పాత రాజకీయ పంథాలో వ్యవహరిస్తున్నారు. 'ప్రజాస్వామ్యం నిజంగా పార్లమెంటు బయటే ఉంది, 125 కోట్ల ఐడియాలున్న దేశం మనది' అని పైకి ఎంత ఉదాత్త పలుకులు చెబుతున్నా.. ఆచరణలో ఇందిరాగాంధీ కాలంనాటి కేంద్రీకృత, బ్లాక్‌మెయిల్ అధికార రాజకీయాలనే కొనసాగి స్తున్నారు. అందుకే మూడేళ్ల పాలన అనంతరం.. మోదీ ఎన్నికల విజయాలు ఈ దేశ విజయాలుగా మారలేదు

అని విస్పష్టంగా చెప్పాల్సి వస్తోంది.

మోదీకి తన వ్యక్తిగత, తన కనుసన్నల్లోని పార్టీ విజయాల విషయంలో తన, పర భేదం లేదు. అలాగే లోక్‌సత్తాకూ ఈ దేశంలో 'అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే రాజకీయం, పాలనా, సామాజిక సంస్కరణల' విషయంలో తన, పర భేదం లేదు. పార్టీకన్నా, ఉద్యమం కన్నా దేశం మిన్న అని స్పష్టంగా నినదించటమే కాదు, ఆచరణలో చూపుతోంది లోక్‌సత్తా. దేశ ప్రయోజనాల కోసం సంస్కరణలు తేవటం తాను మాత్రమే చేయగలపని, తనకు మాత్రమే సంబంధించిన పని అనే భ్రమ లోక్‌సత్తాకు ఏనాడూ లేదు. అందుకే అన్ని వర్గాల, పార్టీలలోని మంచిని కలిపే ప్రయత్నం చేస్తూ అందరి సహకారంతో పనిచేస్తుంటుంది. విషవలయంలో కూరుకుపోవటం వల్ల సాంప్రదాయ రాజకీయ పార్టీల్లోని పలువురు నేతలు, కార్యకర్తలు దేశానికి మంచి కంటే చెడు ఎక్కువగా చేస్తున్నారని, ఆటనియమాలు మార్చి మంచి చేస్తేనే గెలుస్తారనే వ్యవస్థను నిర్మిస్తే వీరంతా మంచి రాజకీయ ప్రతినిధులుగా మారతారని, దేశంలో స్థిరమైన మేలిమి మార్పులకు ఇంతకంటే వేగవంతమైన మార్గం లేదని లోక్‌సత్తా విశ్వాసం. అందుకే కాషాయం–ఎరుపు–నీలం (శాఫ్రాన్–లాల్–నీల్) అని తేడా లేకుండా అందరినీ కలుపుతూ, అందరితో లోక్‌సత్తా కలసి పనిచేస్తుంటుంది. పార్టీ రాజకీయాలతో సంబంధం లేకుండా పౌరసమాజానికీ తగిన పాత్ర కల్పిస్తూ విధానాలను రూపొందిస్తుంటుంది. అన్నిటినీ మించి.. ఈ మొత్తం కృషి, సంస్కరణలపై ప్రజాస్వామ్యంలో ప్రధానపాత్రధారులైన ప్రజలలో చైతన్యం, అవగాహన కలిగించేందుకు కూడా ఉన్నదాంట్లో చాలా వనరులు, సమయం వెచ్చిస్తుంటుంది. ఈ క్రమంలోనే ఎన్డీయేతో, యూపీయేతో కలసి పనిచేసింది. 2014 ఎన్నికలప్పుడు మోదీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతిచ్చింది. కానీ మూడేళ్ల తర్వాత మోదీని 'డీకోడ్' చేసి చేస్తూ.. ప్రజలిచ్చిన తీర్పుని, ప్రజాస్వామ్య రాజకీయాన్ని, భారత్ నిజమైన ఎదుగుదలకు కావలసిన ఎజెండాను ఆయన సరిగా డీకోడ్ చేయలేదనిపిస్తుంది. 2018లో ఎన్నికలు రాబోతున్నాయన్న వార్తల నేపథ్యంలో.. ఈ మాటను ఇప్పుడు నిక్కచ్చిగా చెప్పితీరాల్సిందే.

### మోదీని ఇందుకు కాదా ఎన్నుకున్నది?

మన ప్రజలకు మతిమరపు ఎక్కువ. ఈ ఎన్నికల్లో ఏం




### ఆమ్ ఆద్మీ పార్టీ తప్పిదమూ ఇదే!

ఎన్నికల విజయాలు దేశ విజయాలుగా మారకపోవటానికి.. గెలిచాక మాట తప్పటం, రహస్య ఎజెండాని బైటికి తీసి మోసం చేయటం వంటివి కూడా కారణాలవుతాయి. లోక్‌సత్తా ఒరవడిలో వచ్చిన కొత్త రాజకీయ పార్టీ ఆమ్ ఆద్మీ (ఆప్) ఆ తప్పిదాలు చేయలేదు గానీ.. గెలిస్తే చాలు, విధానాలు, ప్రజల భాగస్వామ్యం, అవగాహన, ఇతర సానుకూల శక్తుల తోడ్పాటు లేకుండానే ఏదైనా చేసేయొచ్చు అనే భ్రమను, అపరిపక్వతను ప్రదర్శించింది. ఢిల్లీకున్న ప్రత్యేక నేపథ్యం దృష్ట్యా ఎన్నికలలో అద్భుత ఫలితాలను ఆప్ సాధించినప్పుడు.. దాన్ని బలోపేతం చేసి దేశమంతా విస్తరించే ప్రయత్నం చేయాల్సింది పోయి, ఎన్నికలు, నెగెటివ్ సంచలనాల ప్రచారం, వ్యక్తిగత గుర్తింపు కోసం ఆప్ వ్యవస్థాపకుడు అరవింద్ కేజ్రీవాల్ అర్రులు జాచారు. ఒకప్పుడు తనకు మెంటారింగ్ చేసిన జేపీ భేషజాలు లేకుండా తనను కలిసి లోక్‌సత్తాతో పొత్తు కోసం అభ్యర్థిస్తే.. ఏమాత్రం సానుకూలతను, దూరదృష్టిని ప్రదర్శించకుండా కేజ్రీవాల్ తోసిపుచ్చారు. చివరికి ఆయన ఢిల్లీలో సాధించింది ఏమీ లేకుండా పోయి, సాంప్రదాయ రాజకీయ పార్టీలకు అదనపు బలాన్ని ఇచ్చారు. 2015లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో 54.3శాతమున్న ఆప్ ఓట్ల శాతం.. తాజా మునిసిపల్ ఎన్నికలలో సుమారు 26శాతానికి కోసుకుపోయింది. కాంగ్రెస్ గెలిచిందనే బాధ కంటే.. ఆప్ ఓడిపోయిందనే ఆనందమే ఎక్కువవటం వల్ల నరేంద్ర మోదీ పంజాబ్ విషయంలో రిలీఫ్ ఫీలయ్యారు. కొత్త రాజకీయం ఎంత చిన్నదైనా, అది దిగ్గజంలాంటి తన పార్టీని దెబ్బతీసే శక్తి కలిగిందని మోదీకి స్పష్టంగా తెలుసు. అంతెందుకు, లోక్‌సత్తా కొత్త రాజకీయం హైదరాబాద్‌లో ఒక్క సీటు గెలిచినా తన ఉనికికి ప్రమాదమని భయపడే.. తెలుగుదేశం పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో జేపీకి మద్దతివ్వకుండా మాటతప్పింది. చివరికి అండగా నిలిచే మంచి లేక, తెలంగాణలో తన ఉనికినే ప్రశ్నార్థకం చేసుకుంది. సాంప్రదాయ రాజకీయ పార్టీలు కొత్త రాజకీయ శక్తులతో వీలున్నంత మేర సంపర్కంతో వెళ్తుంటేనే.. వారికీ భవిష్యత్తు ఉంటుంది. ఈ క్రమంలోనే.. కొన్నాళ్లకు సాంప్రదాయ రాజకీయాల్లోని మంచి నేతలు, కొత్త రాజకీయ శక్తులు కలిసి దేశంలో మార్పును ప్రతిష్ఠించగలుగుతారు.

## మోదీ-షాల రథానికి దక్షిణాది బ్రేక్ వేయొచ్చు

సాంప్రదాయకంగా ఓటు బ్యాంకుల్ని తయారుచేసుకున్న రాష్ట్రాలపైనే కాకుండా కొత్త రాష్ట్రాలపై గురి పెట్టాలని బీజేపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా దక్షిణాదిన కనీసం 100 పార్లమెంటు సీట్లను 2019 ఎన్నికలలో గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. కర్ణాటక, తెలంగాణల్లో ఎక్కువ సీట్లు సంపాదించుకునే వ్యూహాన్ని అమలుచేస్తున్నారు. ఆ తర్వాత క్రమంగా ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు వైపు దృష్టి సారిస్తారు. ఉత్తరాదిన సాంప్రదాయ ఓటు బ్యాంకులో ఏమైనా తేడా వచ్చినా, దక్షిణాది గెలుపులు అక్కరకొస్తాయని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా భావిస్తున్నారు. కానీ మోదీ– షా మార్కు రాజకీయాలు దక్షిణాదిన అంత ఫలించకపోవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. మోదీ ఏరు దాటాక తెప్పతగలేసే ధోరణి, ఏకపక్ష వైఖరులు ఇక్కడ చాలామందికి మింగుడుపడటం లేదు. ప్రత్యేక హోదా విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో మోదీ మీద చాలా ఆగ్రహం ఉంది. కానీ ప్రాంతీయ పార్టీలలో అవినీతి పెచ్చరిల్లటం, అగ్రకులాల ఆధిపత్యం, అంతర్గత ప్రజాస్వామ్యం దాదాపు లేకపోవటం వంటి అవకాశాలను ఉపయోగించుకోవటం, పొత్తులు కుదరకపోతే ఆ పార్టీల్లోని బలమైన నేతలను లాగటం, మీడియాను గుప్పెట్లో పెట్టుకోవటం, పౌరసమాజంలోని ప్రభావశీలురకు తగిన అవకాశాలు కల్పించటం వంటి మార్గాల్లో అనుకున్న సీట్లు సాధించాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది.

చెప్పావెూ వచ్చే ఎన్నికలకు గుర్తుండదు. మధ్యలో ఒకటో రెండో సంచలనాలు, ఎన్నికలప్పుడు ఒక భారీ సంచలనం ఉంటే చాలు.. వారిని ఏమార్చవచ్చు అని ప్రజల షార్ట్ మెమొరీ మీద రాజకీయ నాయకులు ఆటలాడుకోవటం ఎప్పట్నుంచో ఉంది. కుంభకోణాల్లో కూరుకుపోయిన నేతలు కూడా ఇదే టెక్నిక్ వాడతారు. కేసులను నత్రమంగా, నకాలంలో విచారించలేని న్యాయవ్యవస్థ వైఫల్యం వారికి ఎలాగూ ఉపయోగపడుతుంది. కుంభకోణం మరీ పెద్దదైతే.. కొన్నేళ్లు వ్యూహాత్మక మౌనం పాటించి, గుళ్లూ గోపురాలు, దానధర్మాలు వంటి కార్యక్రమాలు, సెంటిమెంట్ల మధ్య రీఎంట్రీ ఇస్తారు. ఫ్రెష్‌గా ప్రజలు తమని రిసీవ్ చేసుకునేందుకు ఒక ఎత్తుగడ ప్రకారం వీరు వ్యవహరిస్తుంటారు. మరీ అవసరమైతే పార్టీని మార్చేసి డబ్బుతో గెలిచే పార్టీ నుంచి గెలుస్తారు. జాతీయస్థాయిలో మోదీ హయాం వచ్చేసరికి ప్రజల షార్ట్‌మెమోరీ ఇంకా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయి. రోజుకో సంచలనం లేకపోతే, ఓ సోషల్ మీడియా పోస్టింగ్ చేయకపోతే నిద్రపట్టని ఈ రోజుల్లో మూడేళ్ల క్రితం మోదీని ఎందుకు గెలిపించామో స్పష్టంగా గుర్తుండటం చాలామంది విషయంలో అనుమానమే.




అందుకే.. మోదీని, ఆయన పార్టీని, మిత్రపక్షాల్ని మనం ఎందుకు గెలిపించామో జాగ్రత్తగా గుర్తు చేసుకోవటం ఈ సమీక్ష సందర్భంలో అవసరం.

తొలి ఏడాదే ప్రధాన చట్టాలను పాస్ చేయటానికి వీలుగా రాజ్యసభ సంస్కరణలు చేపట్టలేకపోవటం, ఉన్నతస్థాయి న్యాయవ్యవస్థలో పారదర్శకతకు జాతీయ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు విషయంలో పేలవంగా వ్యవహరించటం, ఎన్నికల మేనిఫెస్టోల్లో హామీ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంట ఖర్చుకు అదనంగా 50శాతం కలిపి మద్దతు ధర వంటి హామీల్ని తప్పటం వంటి కీలక వైఫల్యాలను సైతం కాసేపు పక్కన పెట్టి.. లోక్‌సత్తా, మెజారిటీ యువత, మధ్యతరగతి మోదీకి మద్దతివ్వటానికి కారణమైన బిగ్ పిక్చర్‌లోని ఐదు ప్రధాన అంశాలనే తీసుకుందాం. ఇవన్నీ మోదీ చెప్పినవి, ప్రజలు ఆశించినవి, ఈ దేశానికి తక్షణావసరమైనవి.

1. ఉద్యోగాలు/ఉపాధి
2. అవినీతి లేని పాలన
3. తాయిలాలు లేకుండా ప్రజలందరినీ సంపదసృష్టిలో భాగస్వాముల్ని చేయటం

4. కులమతాలకతీతంగా దేశమంతటినీ కలిపివుంచటం

5. ఆర్థికాభివృద్ధి

కానీ వీటిలో మోదీ ఈ మూడేళ్లలో ఏం సాధించారు?

**ఉద్యోగాలు**

ఉద్యోగాలు/ఉపాధి కల్పించటం మోదీకి టాప్ ప్రయారిటీ. నెలకు మనదేశంలో 10లక్షలమంది యువత కొత్తగా ఉద్యోగ మార్కెట్‌లోకి వస్తున్నారు. కానీ ఉద్యోగాల విషయంలో మోదీ సాధించింది దాదాపు నెగెటివ్ గ్రోత్. కేంద్ర కార్మికశాఖ విభాగమైన లేబర్ బ్యూరో లెక్కల ప్రకారమే.. కీలక ఆర్థికరంగాల్లో 2015లో కొత్తగా ఏర్పడిన ఉద్యోగాలు కేవలం 1.35లక్షలు. ఇది గత ఏడేళ్లలోనే అతితక్కువ (2009లో 12.8లక్షలు, 2010లో 8.7లక్షలు, 2012లో 3.21 లక్షలు, 2013లో 4.19లక్షలు, 2014లో 4.21 లక్షల ఉద్యోగాలు వచ్చాయి). 2015 తర్వాత వివరాలు కూడా కచ్చితంగా అందించటం లేదు. ఓ అంచనా ప్రకారం, రోజుకు 500కి పైగా ఉద్యోగాలు ఊడుతున్నాయి. స్టార్టప్‌లు, నైపుణ్యాల శిక్షణ, మేకిన్ ఇండియా, మౌలిక వసతుల కల్పన, తీరప్రాంత అభివృద్ధి వంటి కార్యక్రమాలతో ముమ్ముందు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయని మోదీ అంటున్నారు. ఇప్పుడు తనను విమర్శిస్తున్నవారంతా మున్ముందు ఈ మార్పును చూస్తారంటున్నారు. కానీ అంతర్జాతీయ పరిస్థితులను, ఆటోమేషన్ వంటి పరిణామాలను, మోదీ విధానాలను చూస్తుంటే డిమాండ్‌కు తగ్గ భారీ ఉపాధి అవకాశాలు కనపడటం లేదు. నిరుద్యోగ భృతి (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం –యూబీఐ) కల్పించే ప్రతిపాదనను పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించుకోవటం పరిస్థితి జటిలంగా ఉందనటానికి సంకేతం.

భారతదేశాన్ని సమున్నత స్థానానికి తీసుకెళ్లే ఉద్యోగాల కల్పనకు, పేదరిక నిర్మూలనకు అతి ముఖ్యమైన విద్య, ఆరోగ్య రంగాలలో మోదీ చేసింది దాదాపు శూన్యం. ఉద్యోగావకశాలకు తగ్గ నాణ్యమైన చదువులు లేవని పరిశ్రమవర్గాలు, నిపుణులు కోడై కూస్తున్నా.. పాఠశాల విద్యాప్రమాణాలు మెరుగుపరిచే చర్యల మీద మోదీ సర్కారు కదలటం లేదు. రాజుగారి మనసెరిగినట్టు.. నీతి ఆయోగ్ కూడా తన తాజా దార్శనిక పత్రంలో ఈ అంశాన్ని లక్ష్యంగా గుర్తించలేదు. ప్రజలలోని శక్తిసామర్థ్యాలను వెలికితీసి, తగిన ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఎన్నికల గెలుపు బాధ్యతను మోదీ సర్కారు విస్మరించింది.

పదిహేనేళ్ల తర్వాత తీసుకొచ్చిన జాతీయ ఆరోగ్య విధానం అరకొరగా ఉంది. దేశంలో 6కోట్ల మంది కేవలం వైద్యఖర్చులు తట్టుకోలేక పేదరికంలోకి జారిపోతున్నా, అనారోగ్యం, పౌష్టికాహార లోపం వల్ల ఉత్పాదక శక్తి తరుగుతున్నా.. దీటైన ప్రజారోగ్య విధానాన్ని ఆవిష్కరించలేకపోయింది. కేవలం జీడీపీలో 2.5శాతం ఖర్చుతో 'అందరికీ ఆరోగ్యం' అందించేలా లోక్‌సత్తా 2016లో నీతి ఆయోగ్‌కి సమర్పించిన ఆరోగ్య విధానం నమూనాలోని.. నివారణ, ప్రాథమిక ఆరోగ్యం, జనరిక్ మందులు వగైరా అంశాల మీద నూతన జాతీయ ఆరోగ్య విధానంలో దృష్టి పెట్టినా, అమలు పద్ధతుల్లో మాత్రం ఆచరణకు దూరంగా బీమా వంటి మార్గాల వైపు ప్రభుత్వం మళ్లింది.

**అవినీతిరహిత పాలన**

మోదీ వచ్చాక జాతీయస్థాయిలో ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు ఇంతవరకూ రాలేదు. ఇందుకు ఆయన్ని అభినందించాలి. కానీ పాలనలో పై నుంచి కింది దాకా అవినీతి ఎక్కడా తగ్గలేదు. ఉన్నతస్థాయి అధికారుల అవినీతికి కళ్లెం వేసేందుకు అవినీతి నిరోధక చట్టాన్ని బలోపేతం చేయటానికి బదులు.. ఇంకా నీరుగార్చేలా ప్రధాని వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా తమకు లభించాల్సిన ధ్రువపత్రాలు, తాగునీటి కనెక్షన్, పట్టాదారు పాసుపుస్తకం వంటి సేవలకు గతిలేక లంచాలిచ్చే ప్రజలకు కూడా జైలుశిక్ష విధించేలా చట్టానికి సవరణ ప్రతిపాదించారు. లంచం తీసుకునే ప్రభుత్వాధికారి మీద మాత్రం.. ప్రాథమిక విచారణకు కూడా లోక్‌పాల్ అనుమతి కావాలని (17 'ఎ') ప్రతిపాదించారు. 'నేను అవినీతికి పాల్పడను' అనే ముసుగులో ఇంత అవినీతి ప్రోత్సాహక చర్యలకు మోదీ పాల్పడుతున్నారు.

ఇటీవల సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా, కొందరు ఐఏఎస్ అధికారులు తమ పని స్వేచ్ఛకు సీబీఐ, విజిలెన్స్ కమిషన్, కాగ్ వంటివి ఆటంకంగా మారాయని ఆరోపిస్తే.. 'ఆడలేక మద్దెల ఓడు అంటారా?' అని ఎదురు అడగాల్సిన ప్రధాని, వారిని సమర్థిస్తున్నట్టు మాట్లాడారు. 'ఏం జరిగినా నే చూసుకుంటా' అని భరోసా ఇచ్చారు. చట్టం ముందు అందరూ సమానమే అన్న రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన ప్రధాని.. నాకు నచ్చినట్టు పనిచేస్తే, చట్టం నుంచి కూడా రక్షిస్తానన్నట్టు మాట్లాడటం ఏం సుపరిపాలన?! ఇలా ఓ పక్కన చట్టబద్ధ పాలనను అమలు చేయకుండా.. అధికార దర్పానికి సంకేతంగా ఉన్నాయని కార్ల మీద ఎర్ర బుగ్గలను

తొలగించటంవంటి నాటకీయ చర్యలు ఎన్ని ప్రదర్శించి ఏం లాభం?

ఉత్తర ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రధాని మాట్లాడుతూ, పలువురు విపక్ష నేతలపై అవినీతి ఆరోపణలు గుప్పించారు.. వారి మీద విచారణలు జరపొద్దని ఎవరన్నారు ప్రధానీ? ముఖ్యమంత్రులు సహా పలువురిపై కేసులున్నా మీరెందుకు నానుస్తున్నారు? అవినీతి ఆరోపణలున్న ఎంతమంది ఉన్నతాధికారుల మీద మీరు చర్యలు చేపట్టారు? అత్యుత్సాహంతో కోర్టులు చెబితే తప్ప కేసులపై విచారణ లుండవా? ఇంతవరకూ లోక్‌పాల్‌ను ఎందుకు నియమించ లేకపోయారు?



వాళ్లకు కూడా రుణమాఫీ చేయాలని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చారు సార్!

ఇక అన్నిటికంటే ముఖ్యమైన దిగువస్థాయిలో సామాన్యప్రజల రోజువారీ జీవితంలోకి వస్తే.. లంచాలు, వేధింపులు యధావిధిగా కొనసాగుతున్నాయి. ప్రధాని యాప్‌లు, ఇతర సాంకేతిక మంత్రాలు ఉన్నా ఛేదించుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో జనం ముక్కుపిండి లంచం వసూలు చేస్తున్నారు (అవినీతి చెల్లింపులు తగ్గాయి కానీ అవినీతి తగ్గలేదని తాజా సర్వేలు కూడా చెబుతున్నాయి). సర్కారీ ఆఫీసుల్లో ప్రజలకు లంచాలు, వేధింపులు లేకుండా చేయటానికి పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి మేరకు లోక్‌సత్తాయే హక్కుగా 'పౌర సేవల' చట్టాన్ని తయారుచేసింది. దీని ప్రకారం.. ప్రతి పనికీ ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్దిష్ట గడువును పేర్కొంటూ 'సిటిజన్ ఛార్టర్లు' ఉంటాయి. ఈ గడువులోగా పని చేసిపెట్టకపోతే దరఖాస్తు చేసుకున్న ప్రజలకు రోజుకు కనీసం రూ.250 పరిహారంగా చెల్లిస్తారు. పార్లమెంటు వద్ద ఈ బిల్లు ఉన్నా, చట్టం చేయటానికి మాత్రం మోదీకి చేతులు రావటం లేదు.

మనదేశంలో అవినీతికి మూలమైన ఎన్నికల వ్యవస్థ విషయానికొస్తే, ప్రజల్ని పక్కదోవ పట్టించే చర్యలే ప్రభుత్వంలో ఎక్కువగా కనిపిస్తాయి. నల్లధనం, దానితో ముడిపడిన అవినీతి అంతానికే పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) చేస్తున్నట్టు నవంబర్ 8, 2016న ప్రధాని ప్రకటించారు. కానీ నల్లధనానికి మూలమైన ఎన్నికల వ్యవస్థలో ధనప్రవాహం ఏమాత్రం తగ్గలేదని ఇటీవలి ఉత్తరప్రదేశ్ ఎన్నికలు స్పష్టంగా రుజువు చేశాయి. ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన వారు తప్ప మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే మన ఎఫ్‌పీటీపీ (ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్) ఎన్నికల వ్యవస్థలో అదనపు ఓట్ల కోసం కోట్లు వెదజల్లి ఓట్లు కొనుగోలు చేయటం, గెలిచాక అంతకు పదిరెట్లు దండుకోవటం మనదేశంలో నల్లధనం, అవినీతి వేళ్లూనుకునేలా చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, రియల్ ఎస్టేట్ రంగాల్లో రాజకీయ శక్తుల చట్టవిరుద్ధ ప్రమేయాన్ని విపరీతంగా పెంచింది. చట్టసభకు పరిమితం కావాల్సిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ నిర్వహణలో తలదూర్చి నియోజకవర్గ సామంతరాజుల్లా మారారు. ప్రజలకు పనులు చేసిపెట్టి ఓట్లు, డబ్బు దండుకునే ఈ ఎమ్మెల్యే రాజ్‌ను సంస్కరించేందుకు, ఓట్ల కొనుగోలును ఆపేందుకు ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికల, రాష్ట్రాల్లోనయినా దామాషా ఎన్నికల పద్ధతి వంటి సంస్కరణల మీదే ప్రధాని దృష్టి సారించలేదు. డీమానిటైజేషన్ సదుద్దేశంతో, ధైర్యంతో చేసిందే అయినా గురితప్పిందని, దాని లక్ష్యం నెరవేరాలంటే రియల్ ఎస్టేట్, ఎన్నికల రంగాల్లో సంస్కరణలు చేపట్టటంతోపాటు పన్నులకు తగ్గ సేవలందించేలా పౌర సేవల చట్టం వంటి ఏర్పాట్లు చేయాలని లోక్‌సత్తా చెప్పినా.. అభినందించటం తప్ప ప్రధాని నుంచి కార్యాచరణ లేదు. లోక్‌సభ, అసెంబ్లీలకు 'ఒకేసారి' ఎన్నికలంటున్నారు. కానీ, ఓట్లు కొనుగోలు లేకుండా చేసి, నల్లధనం, అవినీతి ఆపే స్థాయి గేమ్ ఛేంజర్ కాదు ఈ జమిలి ఎన్నికలు. అయినా దాన్ని నల్లడబ్బు మీద పెద్దపోరాటం చేసే సంస్కరణలా మోదీ ప్రభుత్వం ప్రచారం చేసుకోవటం విచిత్రంగా ఉంది.

ఈరకంగా, అవినీతిని నిజంగా ఆపగలిగే ఎన్నికల సంస్కరణలు, చట్టసంబంధ ఏర్పాట్లు లేకుండా, అవినీతి అధికారులకు రక్షణనిస్తూ, గతిలేక లంచం ఇచ్చే సామాన్య ప్రజలను జైలు పాలు చేస్తూ, వ్యక్తిగతంగా మాత్రం అవినీతి

## తొలి దశలో ఇవి చేపట్టండి ప్రధానీ: జేపీ



2014 ఎన్నికలలో తాను ఇచ్చిన హామీలు, చూపిన లక్ష్యాలకనుగుణంగా తొలిదశలో ఈ 8 జాతీయస్థాయి ప్రాధాన్యతగల అంశాలను చేపట్టాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అదే సంవత్సరం చివరలో ప్రధాని నరేంద్ర మోదీకి నోట్ పంపారు.

1. పాఠశాల విద్య సంస్కరణలు – ప్రతి బిడ్డకీ మంచి ప్రమాణాల చదువు
2. అందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం – జేబులో నుంచి ఖర్చు లేకుండా
3. స్థానిక ప్రభుత్వాలకు నేరుగా తలసరి నిధుల కేటాయింపు. ఉదాహరణకు ఏటా ఒక్కొక్క పౌరునిపై రూ. 1000–2000 పంచాయతీలు, మునిసిపల్ వార్డు స్థాయికి
4. పరిశ్రమల స్థాపనకి, పెట్టుబడులకి అవరోధాలను, జాప్యాన్ని తొలగించటం, పెద్ద ఎత్తున ఉద్యోగాలను అందించటం
5. వ్యవసాయాన్ని పరిరక్షించటం

ఎ) ప్రజాపంపిణీ వ్యవస్థ స్థానంలో అవినీతికి ఆస్కారంలేని ప్రభావశీలమైన ఆహార భద్రత

బి) పప్పుదినుసులు, వంటనూనె గింజలపై దిగుమతి సుంకాలు – ఆ పంటల రైతులకి ప్రోత్సాహకాలు

సి) వ్యవసాయ వ్యర్థాలను పరిష్కరించటం, అదనపు విలువ చేకూర్చటం

డి) రిటైల్ చెయిన్ల ద్వారా దళారీలను తొలగించటం

6. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, వేధింపులు లేకుండా నిర్ణీత గడువులోగా ప్రజలకు హక్కుగా సేవలందించే, గడువు దాటితే పరిహారం చెల్లించే సర్వీస్ గ్యారంటీలు (పౌర సేవల చట్టం)
7. న్యాయ సంస్కరణలు

ఎ) అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు (ఎఐజేఎస్) ఏర్పాటు

బి) స్థానిక కోర్టుల ఏర్పాటు, మహిళల రక్షణ

సి) సీపీసీ, సీఆర్‌పీసీ చట్టాలలో సవరణలు – కోర్టుల్లో విచారణలు సులభతరం చేయటం

8. సివిల్ సర్వీసు సంస్కరణలు

ఆ తర్వాత కూడా.. చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు ప్రత్యామ్నాయ బిల్లు, అసంబద్ధ జనాకర్షక పథకాలను కట్టడి చేసేలా ప్రజాప్రాతినిధ్య చట్ట సవరణ, సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి సంస్థాగత ఏర్పాట్లు, అప్పనంగా లాభాలపై విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ పన్ను, అవినీతి నిరోధక చట్ట సవరణ, రియల్ ఎస్టేట్ సంస్కరణలు, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి.. ఇలా ప్రజల సాధికారతను పెంచే పలు ఆచరణాత్మక పరిష్కారాలను, సంస్కరణలను సందర్భానుసారంగా, దశలవారీగా.. నేరుగా లేదా సామాజిక మాధ్యమాల ద్వారా తగిన వివరాలతో ప్రధాని దృష్టికి జేపీ తీసుకెళ్తున్నారు.

ఆరోపణలు లేకుండా ఉంటే.. దీన్ని అవినీతిరహిత పాలన అనగలమా?

### తాయిలాలతో మభ్యపెట్టకుండా ప్రజలందరినీ సంపద సృష్టిలో భాగం చేయటం

2014 ఎన్నికల్లో తెలుగునాట చంద్రబాబు నాయుడు, కె.చంద్రశేఖరరావు రుణమాఫీ, కోటాలు అంటూ తాత్కాలిక తాయిలాల్ని ప్రకటించారుగానీ.. మోదీ అభివృద్ధి, ఉద్యోగాలు వంటి సానుకూల ఎజెండాతో గెలిచారు. కానీ ఈ మూడేళ్లలో ఆ దిశగా చెప్పుకోదగిన కృషి లేదు. ఇటీవలి యూపీ ఎన్నికల్లోనయితే, రైతులకు రుణమాఫీని సైతం ప్రకటించారు. కేంద్ర ఖజానా నుంచి డబ్బు చెల్లించటానికీ సిద్ధపడ్డారు. కానీ ఇతర రాష్ట్రాల నుంచి కూడా డిమాండ్లు రావటంతో తూచ్ అంటూ రాష్ట్రం ఖాతాలోకి నెట్టారు. ప్రజల్ని సంపద సృష్టిలో భాగం చేయటానికి తాయిలాలకు బదులు మానవవనరుల నిర్మాణానికి మోదీ చిత్తశుద్ధితో ఎటువంటి ప్రయత్నం చేయటం లేదు. పైన ఓ ఇరవైశాతం మంది, దిగువన చిన్నచిన్న అవకాశాలతో బతుకుతూ తలెత్తకుండా ప్రభుత్వ కనుసన్నల్లో ఉండే ఎనభైశాతం మంది.. అనే ధోరణితోనే వ్యవహరిస్తున్నారు. ప్రజల శక్తిసామర్థ్యాలను వెలికితీసే అవకాశాలను అందిచకుండా.. ఏదోకరకంగా బతుకుబండిని లాగేందుకు పైనుంచి

అవకాశాలనిచ్చే ప్రభుత్వపెద్దలా మోదీ వ్యవహ రిస్తున్నారు. ఇందుకోసం లైసెన్స్ రాజ్‌ను కూడా ప్రవేశ పెడుతున్నారు.

**ఆర్థికాభివృద్ధి**

ఆర్థికాభివృద్ధి విషయంలో మోదీ చిత్తశుద్ధితోనే పనిచేశారు. ఇందుకోసం విదేశాలలో విస్తృతంగా పర్యటించి సత్సంబంధాలు ఏర్పరచుకునే ప్రయత్నం చేశారు. అయితే సరైన బృందాన్ని ఏర్పాటు చేసుకోకపోవటం వల్ల.. ఆయన చిత్తశుద్ధిని అవగాహనారాహిత్యం దెబ్బ తీస్తోంది. వ్యక్తిగతం, అభద్రతాభావం ఎక్కువై వాస్తవాలను నిర్లక్ష్యం చేయటం వల్ల విదేశీ సంబంధాల నుంచి రావాల్సిన ఫలితాలు భారత్‌కు సమకూర లేదు. ఆసియా శతాబ్దాన్ని అందుకోవటంలో పొరుగున ఉన్న చైనాకు దీటుగా వ్యవహరించటం మీదే ఆధారపడిన భారత ఉజ్వల భవిష్యత్తును సాకారం చేయాలంటే.. ప్రధాని ఇంకా చాలా చేయాల్సి ఉంది. పెట్రో ధరల పతనం వల్ల కలిసొచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ నిత్యావసరాల ధరల్ని చాలామేర అదుపులో ఉంచినా, దేశంలోని కోట్లాది రైతుకుటుంబాలకు న్యాయమైన ఆదాయం అందించటంలో విఫలమయ్యారు. రైతులకు సరైన ఆదాయం ఉంటే, పన్నులకు తగ్గ సేవలు అందిస్తుంటే.. పన్నులు వేసినా అర్థం ఉంటుంది. కానీ ఇప్పుడు రైతులకేదో ఆదాయం ఉన్నట్టు, దాన్ని రెట్టింపు చేసి పన్ను పరిధిలోకి తెస్తామని నీతి ఆయోగ్ మాట్లాడుతోంది. ఆర్థికంలో పాతపద్ధతిలో.. విదేశీ పెట్టుబడుల మీదే కేంద్రీకరించారు తప్ప.. ఇంతకుముందు అనుకున్నట్టు దేశీయంగా ప్రజల శక్తిసామర్థ్యాలను వెలికితీసి, డిమాండ్‌ను, మార్కెట్‌ను, జాతీయాదాయాన్ని పెంచేందుకు వేగంగా కృషి చేయలేకపోయారు.




**కులమతాలకతీతంగా దేశమంతటినీ కలిపి ఉంచటం**

2014 ఎన్నికల్లో లోక్‌సత్తా, ఇతర కొన్ని ప్రగతిశీల శక్తులు మోదీకి మద్దతిచ్చారంటే– ఆయన కులమతాలకతీతమైన భాష వాడటం, ఎజెండాను ప్రకటించటం అందుకు కారణం. లోక్‌సత్తా చెప్పిన 'సురాజ్య' భావనను కూడా మోదీ ప్రచారంలో ఉపయోగించుకున్నారు. కానీ గెలిచాక.. ఆయన పార్టీ ఎంపీలు ఇతర మతాలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుంటే, కుల సమీకరణలు చేస్తుంటే మోదీ మౌనం పాటిస్తున్నారు. ఆహారపు అలవాట్లపై, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడులు చేస్తుంటే.. అప్పుడప్పుడు, చాలా ఆలస్యంగా, ముక్తసరిగా ఖండిస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ఈ ధోరణలు పలు విపరిణామాలకు దారితీస్తున్నాయి. కాశ్మీర్‌లో వైఫల్యానికి కూడా మోదీ ప్రభుత్వ ఈ ఉదాసీన ధోరణులు తోడయ్యాయి. దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో హిందుత్వ పేరుతో జరుగుతున్న విద్వేష కలాపాలు.. కాశ్మీర్లో ముస్లిం రాజ్యస్థాపన కోసం ఉవ్విళ్లూరుతున్న వారికి అవకాశంగా మారినా మోదీ సకాలంలో సరైనరీతిలో స్పందించలేకపోయారు. దీంతో.. ఇప్పటిదాకా స్వయంప్రతిపత్తి, విద్య, ఉద్యోగాలు, పాకిస్తాన్ ప్రేరిత ఉగ్రవాదం చుట్టూ రగిలిన కాశ్మీర్ ఆందోళనకు ఇప్పుడు జీహాద్ వచ్చి చేరింది. అంతర్గత భద్రత ఈ దేశానికి పెనుప్రమాదంగా మారుతోంది. ఈ విషయంలో మోదీ వైఫల్యం ఎటు దారితీస్తోందో అని పలువురు ఆందోళన చెందుతున్నారు.

చైనా సహా ప్రపంచంలో ఏ దేశంలోనైనా మార్పును తేవచ్చుగానీ.. భారత్‌లో పరివర్తన తీసుకురావటం కష్టమైన పని, చాలా ప్రయత్నం కావాలి అని సింగపూర్ వ్యవస్థాపకుడు లీ క్వాన్ యూ చెప్పిన మాటల్ని మోదీ తప్పుగా అర్థం చేసుకున్నట్టు కనిపిస్తుంది. దేశమంతటినీ హిందీ, హిందూత్వలోకి మార్చి, మొబైల్ ఫోన్ నుంచి అంతా ఒకే ప్రోగ్రాం, ఒకే పార్టీతో డిక్టేట్ చేయాలని భావిస్తున్నట్టుంది. రోబో తరహాలో మోదీ, ఆయన పార్టీ మారతానంటే వారి ఇష్టం. కానీ ఇంత సువిశాల, సంక్లిష్ట భిన్నత్వం ఉంది కాబట్టే.. భారత్‌లో ప్రజాస్వామ్యం ఉందని, ఎన్ని లోపాలున్నా ప్రజాస్వామ్యానికి నియంతృత్వం ప్రత్యామ్నాయం కాదని మర్చిపోకూడదు. క్రీస్తు పుట్టకముందు నుంచీ భారత్‌లో స్వతంత్రప్రతిపత్తిగల గణరాజ్యాలున్నాయి. ఈ లిటిల్ రిపబ్లిక్కులను మహాబలశాలురైన, చండశాసనులైన చక్రవర్తులు కూడా కదిలించలేదు. స్థానిక స్వయంపాలనను స్వేచ్ఛగా

వదిలేశారు. కానీ భారతీయ సంస్కృతిని పరిరక్షిస్తున్నాం అని చెప్పుకునే మోదీ మాత్రం.. స్థానిక స్వపరిపాలనను, భిన్నత్వాన్ని, స్థానిక భాషలను చిన్నచూపు చూస్తున్నారు. ఒకే దేశం – ఒకే ప్రజ అంటే.. భిన్నత్వం, బహుళత్వం లేకుండా చేయటం కాదు!

ఈ రకంగా 2014లో ఇచ్చిన మౌలిక హామీల్ని నెరవేర్చటంలో మోదీ ఇప్పటిదాకా చాలామేర విఫలమయ్యారు. ఇవి నెరవేరివుంటే.. ఆయన హిందూ ఛాందసత్వాన్ని ప్రోత్సహించినా, మరోటన్నా కూడా మనం పట్టించుకోకుండా గట్టి మద్దతివ్వచ్చు. వాటన్నిటినీ దాటేసే ఫలితాలను ఆ ఎజెండా చూపించగలుగుతుంది కాబట్టి! మోదీ ఇంకొంత ఆలస్యంగా ఫలితాలు చూపిస్తారనుకున్నా.. ఆ దిశగా విధానాలు, చర్యలు కనిపించటం లేదు. 'కాగ్' లెక్కల ప్రకారం వ్యవహరిస్తే దేశం అభివృద్ధి చెందదు లాంటి వ్యాఖ్యలు ఆయన పరిమితిని చెప్పకనే చెబుతున్నాయి. జాతీయోద్యమ నేతలు, రాజ్యాంగ నిర్మాతలు, 2014లో ఎక్కువశాతం ఓటర్లు ఆశించింది ఇది మాత్రం కాదు.

నీతినిజాయతీల్లో ప్రపంచంలో ఏ గొప్ప దేశ ప్రజానీకానికి తీసిపోనివారు భారతీయులు. కానీ పేదరికం, అవిద్య, వివక్షల్ని తొలగించే విద్య, ఆరోగ్యం, స్వేచ్ఛామార్కెట్ వంటి విధానాలు పాలకులకు లేకపోవటం వల్ల.. వాళ్లలో పలువురు ఓట్లు అమ్ముకుంటున్నారు, అవినీతి, దోపిడీలో చిక్కుకున్నారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఇవ్వని కేంద్రీకృత పాలన వల్ల తన ఓటుకు – తాను కడుతున్న పన్నుల డబ్బుకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోక తాత్కాలిక ప్రయోజనాలకు, భావోద్రేకాలకు లంగిపోతూ అనర్హులకు, అసమర్థులకు, దొంగలకు ఓట్లు వేస్తున్నారు. వీటిని మార్చి సుపరిపాలన అందించే వ్యవస్థను నిర్మించే చారిత్రక కర్తవ్యంతో ఎన్నికైన మోదీ.. ఉన్న వ్యవస్థలను సైతం బలహీన పరిచేలా వ్యవహరించటం విచారకరం. మోదీకి (మంచి దుస్తుల మీద తప్ప) వ్యక్తిగత ఆస్తుల పట్ల మోజు లేకపోవచ్చు. గాంధీ, నెహ్రూ, పటేల్, లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, అంబేద్కర్‌లాగా చరిత్రలో నిలిచిపోయి తన పార్టీకి ఓ పెద్ద ఐకాన్‌లా వెలుగొందాలనే ఆకాంక్ష మాత్రమే ఉండొచ్చు. కానీ అది ఎన్నికల విజయాలతోను, ప్రచారంతోనూ రాదు. వరస ఎన్నికల్లో గెలవగానే, సోషల్ మీడియాలో ఫాలోవర్లు పెరగగానే గాంధీ, పటేల్ బొమ్మలను పక్కనపడేయటం, గాంధీ బొమ్మకు బదులు తన బొమ్మను ప్రచురించినా మౌనాంగీకారం తెలపటం గొప్ప నాయకుడి లక్షణమా?

కొంతమంది బ్యూరోక్రాట్ల కోటరీతో,

ఎన్నివేల కోట్లయినా విరాళాలివ్వగల 'పైస్థాయి సంపన్నులను', ఓట్లు వేసే 'సామాన్య ప్రజలను' (డీమానిటైజేషన్‌తో వీరిని సంపన్నులకు వ్యతిరేకంగా (పైస్థాయి సంపన్నులను మాత్రం మోదీ రక్షించుకుంటున్నారు) మోహరించి మోదీ మాస్ లీడర్ విజయాల్ని సొంతం చేసుకుంటున్నారు), ప్రాచుర్య మీడియాను గుప్పెట్లో పెట్టుకుని,

ప్రతి కులాన్ని/కొన్ని కులాల సమూహాన్ని మైనారిటీగా మార్చేలా కులాల మధ్య విభజన చేసి (అసమానతల కులాలతో నిండిన) హిందూత్వను కులాలకతీతమైనదిగా చిత్రీకరిస్తూ,

ముస్లిం, ఇతర మైనారిటీలను బూచిగా చూపిస్తూ,

ఇతర పార్టీల నుంచి బలమైన నేతలను లాగుతూ,

కేవలం ఓ ఇరవై శాతం మంది అభివృద్ధినే దేశాభివృద్ధిగా చూపే

మోదీ ఫార్ములా కొంతకాలం పనిచేయవచ్చు. కాంగ్రెస్ బాటలో.. వ్యక్తిగత అవినీతి, వంశపారంపర్య రాజకీయాలలో కూరుకుపోయిన ప్రాంతీయపార్టీలు విస్తరించి ఉన్న మనదేశంలో మోదీ మహాబలుడవటంలో ఆశ్చర్యంలేదు. కానీ విద్య, ఆరోగ్యం, రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిపత్తి, స్థానిక ప్రభుత్వాలకు నిధులు–అధికారాలు, చట్టబద్ధ పాలన అందించకుండా, న్యాయస్థానాలు తీర్పుల్ని సైతం ప్రభావితం చేస్తున్నారన్న అనుమానాలు రేకెత్తిస్తూ దేశాన్ని గుప్పెట్లో పెట్టుకోవాలంటే.. ఆయనకు, ఆయన పార్టీకి చేటు చేసుకోవటమేకాకుండా, దేశానికి తీవ్ర నష్టం చేసినవారవుతారు. సారం లేకుండా నిర్మాణాల ఓటితనం ఎప్పటికైనా బైటపడక తప్పదు! మోదీ కంటే అధ్వాన్న ఆలోచనలతో ప్రతిపక్షాలు అసమర్థంగా ఉంటే, యోగి ఆదిత్యనాథ్ వంటి వారి రూపంలో అంతర్గతంగానో, పౌరసమాజం నుంచో మోదీకి ప్రత్యామ్నాయం రూపుదిద్దుకుంటుంది.

మనకు మోదీయా, యోగినా, మరొకరా అన్నది ముఖ్యం కాదు. ఎన్నికల ప్రయోజనాలు దేశ ప్రయోజనాలుగా మారాలి. యువశక్తి పొంగిపొరలుతున్న దేశానికి.. ప్రతి నిముషం ఎంతో విలువైనదిప్పుడు. అందుకే అధికారంలో ఉన్న మోదీ ఇప్పటికైనా మారతారని ఆశిద్దాం. భయపెట్టి కట్టడి చేయటం, వాగాడంబరంతో మురిపించటం దీర్ఘకాలం ప్రభావం చూపే నాయకుల లక్షణం కాదు. తాను ఆశిస్తున్న కీర్తిప్రతిష్ఠల కోసమైనా.. మోదీ విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, అవినీతి నిర్మూలన, చట్టబద్ధ పాలన, ఎన్నికల సంస్కరణలు తదితర కీలకాంశాల మీద దృష్టి పెట్టాలని కోరుకుందాం. ఎ

# రాజకీయ సంస్కరణలు - ఎన్నికల పొత్తులు - క్రూర సంకటం!

- డా॥ జయప్రకాష్ నారాయణ్

***(2014 ఎన్నికల సమయంలో.. ఎన్నికల పొత్తులు, నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ వైపు మొగ్గు చూపటానికి కారణాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ పార్టీ సహచరులకు అప్పట్లో రాసిన లేఖ ఇది. ఈ పత్రాన్ని ప్రజలకు కూడా విడుదల చేశారు.)***



**1975**వ సంవత్సరం మండువేసవి రోజులవి. పంతొమ్మిదేళ్ల కుర్రాడిగా గుంటూరు మెడికల్ కాలేజీ హాస్టల్ గదిలో ఉంటూ, అలహాబాద్ కోర్టు కేసులో రాజ్‌నారాయణ్ పక్షాన శాంతిభూషణ్ వినిపిస్తున్న వాదనలను అమితాసక్తితో గమనిస్తుండేవాడ్ని.

అప్పటికి కొన్ని నెలల ముందే అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ రాజీనామా చేశారు. న్యాయప్రక్రియను అడ్డుకోవటం, అధికార దుర్వినియోగం ఆరోపణల మీద ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. ఆ నేరాలన్నీ ఇవ్వాల్టి తరానికి చాలా చిన్నవిగా కనిపించవచ్చు! కానీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన అమెరికా అధ్యక్షుడు అవమానభారంతో పదవిని కోల్పోవలసి వచ్చింది.

మనదేశంలో ఇందిరాగాంధీని పదవి నుంచి కోర్టు తొలగించింది. రెండు వారాల తర్వాత, జూన్ 25న భారత్ మీద అత్యయిక పరిస్థితిని రుద్దారు. ఒకే పరిస్థితికి ప్రతిస్పందన.. అమెరికాలో ఒకలా ఉంటే, మనదేశంలో మరోలా ఉంది. అక్కడ అధికారాన్ని కోల్పోతే, ఇక్కడ దేశాన్నే జైలుగా మార్చారు. భరింపశక్యంగాని నేరమిది. ఒక రాజ్యాంగబద్ధ, స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య దేశంలో ఒక వ్యక్తి ఒకే ఒక్క ఏకపక్ష చర్యతో, సార్వభౌములైన ప్రజల హక్కుల్ని కాలరాయటాన్ని చూసి యావత్ దేశం దిగ్భ్రాంతి చెందింది. యువత మనసులో చెప్పలేని అలజడి, ఆరాటం. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ గనక.. మూడవ అంతస్తు బాల్కనీ నుంచి దూకి సామూహిక ఆత్మహత్యకు పాల్పడండి, అలా చేస్తే ఈ భయంకర పరిస్థితి మారుతుంది అని చెప్పివుంటే, మాలో చాలామందిమి సంతోషంగా దూకేసి ఉండేవాళ్లం.

ఇందిరాగాంధీయే విలన్ అని మనందరం అనుకునే రోజులవి. ఆమెను అధికారం నుంచి తప్పిస్తే చాలు, మంత్రం వేసినట్టు దేశం అమాంతం మారిపోతుందని నమ్మేవాళ్లం. నిజానికి, 1977 మార్చి నెలలో ఢిల్లీలో అధికార మార్పిడి జరిగింది. కానీ గాంధేయ విప్లవం పట్ల ఆరాధన, ఆకర్షణ తగ్గగానే మరీ ఇంత చిన్న మార్పా అనే దిగులే చివరకు మిగిలింది. స్వేచ్ఛను పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు. కానీ దేశంలో రావాల్సిన మిగిలిన అనేక మార్పులలో ఆనాడు సాధించింది మాత్రం దాదాపు శూన్యం.

ఈ పరిణామాలే దేశానికి సంబంధించి నా దార్శనిక దృష్టిని తీర్చిదిద్దాయి. మన వ్యవస్థ ఎలా ఉంది, అసలు ఎలా ఉండాలి గురించి.. నివారించదగ్గ బాధలు, వెలికితీయని

సామర్థ్యాలు గురించి నా ఆలోచనను మలిచాయి. ఇవే నన్ను ఐఏఎస్‌లోకి నడిపించాయి. అయితే, ఎమర్జెన్సీ కాలానికి సంబంధించి నాలోని కోపావేశాలు, గాయం మాత్రం ఆరలేదు.

కాలం గడిచేకొద్దీ, మన రాజకీయ, పరిపాలనా సంక్షోభాలకు తేలికైన పరిష్కారాలు లేవని దేశం గుర్తించటం మొదలుపెట్టింది. వ్యవస్థని మార్చటం చిట్కాలతో మార్చటం సాధ్యం కాదని కూడా అర్థమవసాగింది. పెద్ద రాజకీయ పార్టీలకు కొన్ని బలాలున్నప్పటికీ, బలహీనతలే ఎక్కువగా ఉన్నాయి. నిజానికి దేశంలో ప్రజాస్వామ్య విషవలయానికి వాళ్లు కూడా బలవుతున్నారు.

ఈ వాస్తవాన్ని గుర్తించబట్టే, లోక్‌సత్తా ఎన్డీయే, యూపీయే రెండు ప్రభుత్వాలతో కలిసి పనిచేసింది. ఈ రాజకీయ భాగస్వామ్యమే ఈ దేశ సంస్కరణల ఎజెండాని పదిహేనేళ్లకు పైగా ముందుకు నడిపించింది. లోక్‌సత్తా సాధించిన ఫలితాలు ముంజేతి కంకణాల్లా కనిపిస్తున్నాయి.

- అభ్యర్థులు తమ నేరచరిత్రను బైటపెటాలనే చట్టం 2003లో రావటం
- ఏళ్ల తరబడి నిర్విరామ పోరాటం వల్ల ఓట్ల నమోదు ప్రక్రియ తేలికవటం, మెరుగుపడటం
- తెహల్కా కుంభకోణం నేపథ్యంలో రాజకీయ పార్టీల నిధుల సేకరణకు పారదర్శక చట్టం
- పార్టీ ఫిరాయింపుల చట్ట నిబంధనల్ని కొంతమేరయినా పటిష్టపరచటం
- మంత్రివర్గ పరిమాణాన్ని కుదించటం
- సమాచారహక్కు చట్టం
- 2009లో స్థానిక న్యాయాలయాల చట్టం
- 97వ రాజ్యాంగ సవరణ ద్వారా సహకార సంఘాలకు స్వయం ప్రతిపత్తి
- బలమైన లోక్‌పాల్ చట్టం సాధించటంలో కీలకపాత్ర
- 2జీ స్పెక్ట్రం లైసెన్సుల్ని రద్దు చేయించి సహజ వనరుల కేటాయింపుల్లో వేలం పాట పద్ధతి వచ్చేలా చేయటం
- వ్యవసాయ వాణిజ్యంలో ఆంక్షలు తొలగించి రైతుకు ఆదాయాన్ని పెంచటం
- వాన్‌పిక్ కుంభకోణాన్ని సాక్ష్యాధారాలతో అసెంబ్లీలో బైటపెట్టి తీరప్రాంతంలో గుత్తాధిపత్యానికి అడ్డుకట్ట వేయటం
- న్యాయప్రమాణాలు, జవాబుదారీపై చట్టం
- ఉన్నత న్యాయమూర్తుల నియామకాల సంఘం (ఎన్‌జేఏసీ) ఏర్పాటుకు రాజ్యాంగ సవరణ
- సకాలంలో పౌరులకు ప్రభుత్వ సేవలు అందించకపోతే పరిహారం చెల్లించేలా పౌర సేవల (సర్వీస్ గ్యారంటీ) బిల్లును పార్లమెంటు దాకా తీసుకెళ్లటం

ఇటీవల మన రాష్ట్ర విభజన అంశంలో కూడా, అన్ని ప్రాంతాల ప్రజలూ గెలిచేలా పరిష్కారాన్ని సూచించటంలో అన్ని ప్రధాన పార్టీలతో కలసి పనిచేయటం ద్వారా, మేధో నాయకత్వాన్ని అందించటం ద్వారా లోక్‌సత్తా తన సత్తాను చాటిచెప్పింది. నిజానికి లోక్‌సత్తా ప్రతిపాదించిన రోడ్‌మ్యాపే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకకరణ బిల్లులో పేర్కొన్న సవరణలకు ప్రధాన ప్రాతిపదికగా నిలిచింది. ఈ రోడ్‌మ్యాప్‌కే కాంగ్రెస్, బీజేపీలు మద్దతిచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ - రెండు రాష్ట్రాల ఆర్థిక భవిష్యత్తుకు పునాది పడింది.

మనదేశం ఆఫ్రికా, ఐరోపా ఖండాలు కలిపినంత సంక్లిష్ట, వైవిధ్య దేశం. మన ఎన్నికల వ్యవస్థ స్థానికంగా ఓట్లు బాగా పొందే పార్టీలకు అనుకూలమైనది. నియోజకవర్గంలో ఒక ఓటు ఎక్కువయితే గెలుపు, ఒక ఓటు తగ్గినా ఓటమి ఉండే ఈ ఎన్నికల వ్యవస్థలో నిజమైన దీర్ఘకాల మార్పుని కోరు ప్రజాస్వామ్య ఉద్యమాలకు అడుగడుగునా అవరోధాలే. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలో ఇతర పార్టీలు కనీస రాజకీయ ప్రమాణాలను పాటించటానికి సిద్ధమయితే, వారితో కలసి పనిచేయటం ద్వారానే జాతి ప్రయోజనాలను సాధించగలమని లోక్‌సత్తా గుర్తించింది. ప్రజాస్వామ్య సంస్కరణలు, ప్రభుత్వ నిర్వహణలోను, రాజకీయంలోను పౌరుల భాగస్వామ్యం, జీవన ప్రమాణాలని పెంచటం - ఇవీ మన లక్ష్యాలు. ఇందుకోసం సమష్టి కృషి అవసరం.

ఈ సమష్టి కృషి వల్లనే కొన్నేళ్లుగా మనం దేశంలో అనేక సానుకూల మార్పులను సాధించగలిగామని అనుభవం చెబుతోంది. 1996లో చాలామంది యువ, మధ్యతరగతి భారతీయులు ఓటు వేయటం గురించే పట్టించుకునేవారు కారు. ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండటాన్ని గర్వంగా చెప్పుకునేవాళ్లు. కానీ ఈవేళ అన్నివర్గాల ప్రజలూ ఓటు వేయటానికి ఆసక్తి చూపుతున్నారు. ఆ రోజుల్లో సంపన్న వర్గాలు రాజకీయాల్ని తిరస్కరించేవాళ్లు.

రాజకీయాలకు దూరంగా ఉండేవాళ్లు. కానీ ఈవేళ విద్యావంతులు, ప్రభావ శీలురైన భారతీయులు మంచి రాజకీయాన్ని ఈదేశ భవిష్యత్తుకు అత్యంత కీలకాంశంగా గుర్తిస్తున్నారు. నిర్మాణాత్మక రాజకీయ పాత్రను నిర్వహించటానికి ఉత్సాహం చూపుతున్నారు.

రాజకీయం ఓ పవిత్ర వ్యాసంగమని లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా వాదిస్తూ పదేపదే చెబుతూ వస్తోంది. రాజకీయాల పట్ల, రాజకీయాల్లో భాగస్వామ్యం పట్ల మన సమాజం ఆలోచనాధోరణిని మార్చటంలో లోక్‌సత్తా చాలా కీలకపాత్రను పోషించింది.

రాజకీయ పార్టీలను, నాయకులను లోక్‌సత్తా ఏనాడూ అంటరానివిగా చూడలేదు. పార్టీలు, ప్రభుత్వాలతో ఎంతో హుందాగా, దాపరికం లేకుండా, నిజాయతీగా, లోక్‌సత్తా ప్రమాణాలకు అనుగుణంగా కలసి పనిచేశాం. మన ప్రజాస్వామ్యాన్ని మరింత మెరుగు పరచడంలో లోక్‌సత్తా ఇన్ని విజయాలను సాధించగలిగిందంటే, అది రాజకీయంలో ఉన్న అందరితో కలసిపనిచేయటం ద్వారానే.

యువత, మధ్యతరగతి, రాజకీయంగా ప్రాతినిధ్యం దొరకని వర్గాలని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించటం వల్లే కొత్త రాజకీయ సంస్కృతికి వేదికగా 2006లో లోక్‌సత్తా పార్టీని స్థాపించాం. కొత్త రాజకీయం కోసం తాడోపేడో తేల్చుకునే స్థాయిలో ఈ వర్గాలన్నీ అగ్రులు జాస్తేనే మార్పు వేగవంతమవుతుంది. రాజకీయం అంచుల్లోకి నెట్టివేయబడ్డ ఈ వర్గాలన్నీ తమ గళాన్ని వినిపిస్తూ సృజనాత్మకంగా వ్యవహరించటం మొదలుపెడితే, పాతుకుపోయిన రాజకీయ పార్టీలన్నీ తమ పంథాలు మార్చుకుంటాయి, ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరుస్తాయి. చాలా సమాజాల్లో మార్పు ఈ విధంగానే సాధ్యమయింది. ఈ పార్టీలు గనక ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటంలో విఫలమైతే.. వాటంతటవే బలహీనపడి పరిమితమై పోతాయి, కొత్త రాజకీయ శక్తులు వాటి స్థానాన్ని భర్తీ చేస్తాయి.

నైతిక రాజకీయాలని పాటించే సంస్కరణల పార్టీకి కఠిన అవరోధా లుంటాయి. ఒక్క ఓటు ఎక్కువొచ్చినా, తక్కువొచ్చినా ఫలితాలు తారుమారైపోయే మన ఎఫ్‌పీటీపీ ఎన్నికల వ్యవస్థలో గెలుపు సాధించాలంటే నియోజకవర్గంలో చాలా ఎక్కువశాతం ఓట్లు కావాలి. పరిస్థితులన్నీ అనుకూలించినా కొత్త పార్టీలు తక్షణ ఎన్నికల విజయం సాధించటానికి ఎదురీదాల్సిందే. ఓట్ల కోసం డబ్బు, కండబలం, కులం, మతం, ప్రాంతం వంటి అంశాల మీద ఆధారపడకుండా, కొత్త రాజకీయ సంస్కృతి నిర్మాణం కోసం ఏర్పడిన లోక్‌సత్తా వంటి పార్టీలకు ఆ సవాలు ఇంకా సంక్లిష్టంగా ఉంటుంది.

లోక్‌సత్తాకు తెలుగునాట ప్రజలలో అపారమైన ఆదరణ, గౌరవం ఉన్నాయి. కానీ లోక్‌సత్తా అభ్యర్థులు గెలిచేస్థాయిలో లేరనే భావన వారికి ఓట్లు పడనీయకుండా, సీట్లు రాకుండా అడ్డుపడుతోంది. లోక్‌సత్తాకు ఎన్నికలలో విజయాలు రాకపోవటానికి ఇదే ప్రాథమిక కారణం. 2009 ఎన్నికలలో హైదరాబాద్‌లో ఎంఐఎం, లోక్‌సత్తా సాపేక్షంగా సాధించిన విజయాలే ఇందుకు గొప్ప ఉదాహరణ. ఎంఐఎం, లోక్‌సత్తాలకు హైదరాబాద్ నగరంలో దాదాపు సమానంగా ఓట్లు వచ్చాయి. కానీ ఎంఐఎంకు పడ్డ ఓట్లు ఏడు అసెంబ్లీ స్థానాలను అందిస్తే, లోక్‌సత్తా కేవలం ఒక్క చోట మాత్రమే గెలవగలిగింది. ఎప్పుడైతే ఒక రాజకీయ పార్టీ స్వచ్ఛందంగా కండబలం, ఉచిత తాయిలాలు, సంకుచిత రాజకీయ విభజనలు చేయకుండా వ్యవహరిస్తుందో, ఎన్నికల విజయాల మార్గం ముళ్లబాటగా, గోతుల ప్రయాణంగా మారుతుంది. మనదేశ నేపథ్యంలో కొత్త పార్టీలకు, నిజాయతీ పద్ధతులకు ప్రతికూలంగా ఎన్నికల వ్యవస్థ ఉండటంతో.. మంచి రాజకీయం చేసే పార్టీలు ఎదుర్కొనే సవాళ్లు మరింత పెరుగుతున్నాయి. ఓ వంక అభిమానం, గౌరవం ఓట్లుగా మారవు..మరోవంక పడిన ఓట్లకు తగిన సీట్లు రావు.

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సాధించిన అద్భుతమైన విజయం ఇందుకు భిన్నమైన ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఈ తరహా విజయాన్ని పునరావృతం చేయవచ్చనే ఆశను ఎంతో పెద్దఎత్తున ఆ పార్టీ కలిగించింది. జాగ్రత్తగా విశ్లేషిస్తే.. ఆప్ విజయానికి ప్రత్యేక కారణాలు కనిపిస్తాయి.

- **ఆ ప్రాంతం:** ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే ఢిల్లీ ప్రజల తలసరి ఆదాయం మూడు రెట్లు ఎక్కువ.
- **జనాభా స్వభావం:** ఢిల్లీ నగర రాజకీయాల మీద, ఓట్ల మీద కులం, మతం, ప్రాంతం ప్రభావం చాలా తక్కువ.
- **మరీ ముఖ్యంగా, మీడియా అనూహ్యస్థాయిలో ఆప్ ఎజెండాను సొంతం చేసుకుంది.** అన్ని పత్రికలు, టీవీ ఛానళ్లు ఇతర పార్టీలను దాదాపు వదిలేసి ఆప్‌కు అసాధారణ, సానుకూల ప్రచారాన్ని నిర్విరామంగా కల్పించాయి.

పై కారణాలన్నీ ఢిల్లీలో ఒక గొప్ప అనుకూల వాతావరణాన్ని సృష్టించి, తొలి

పోటీలోనే ఆప్ అబ్బురపరిచే ఫలితాలను నమోదు చేయటానికి దోహదం చేశాయి. అయితే, దురదృష్టవశాత్తూ ఈ అనుకూల అంశాలు దేశంలో మరెక్కడా లేవు. 2009 ఎన్నికల్లో లోక్‌సత్తా హైదరాబాద్‌లో దాదాపు 10శాతం ఓట్లను సాధించింది. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో ఇంతకంటే తక్కువ ఫలితాన్ని సాధించింది. కొత్త రాజకీయ సంస్కృతిని వ్యాపింపచేయటానికి తలసరి ఆదాయం బాగా ఎక్కువగా ఉండటం, ఆర్థిక స్థితి వల్ల పెరిగిన రాజకీయ అవగాహన, పట్టణీకరణ కీలకమైన అంశాలని ఈ ఫలితాలు కూడా రుజువు చేశాయి.

మధ్యయుగాల భావోద్వేగాలు, కుల సమీకరణలు, డబ్బు, మద్యం, ఉచిత తాయిలాలు, ఒక్క ఓటు కూడా ఫలితాలను తారుమారు చేసే ఎన్నికల వ్యవస్థ ఉన్న తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో మనకున్న మద్దతును చట్టసభలో గెలుపును సాధించే తీర్పుగా తక్కువకాలంలో మలచటం చాలా కష్టమైన పని.

ప్రజాస్వామ్య ఎన్నికల్లో గెలుపు, ఓటములను నిర్ణయించాల్సింది ఓటు వేసే ప్రజలు, పోటీకి దిగేవారి నాయకత్వ పటిమ. కానీ తమ ఓటు వృధా అయిపోతుందేమోనని మంచి నాయకత్వానికి, స్వచ్ఛమైన రాజకీయానికి, నిజాయతీ అయిన ఎజెండాకి ప్రజలు ఓటు వేయకపోతే, ఇప్పుడున్న రాజకీయం తీరు మారదు. అలాగే సమర్థ నాయకత్వాన్ని, ప్రజలకు భరోసాని ఇచ్చే శక్తిగల నాయకులు ఓట్లు కొనకుండా, తాత్కాలిక తాయిలాలు ఇవ్వకుండా మన సమాజంలో గెలుపు అసాధ్యం అని నమ్ముతూ నీతివంతమైన పోరాటానికి దూరంగా ఉంటే పాత రాజకీయమే కొనసాగుతుంది. విత్తు ముందా, చెట్టు ముందా అనే ఈ సందిగ్ధంలో మన రాజకీయ ప్రక్షాళన, మంచి పాలన ఆలస్యమవుతున్నాయి. దేశం విలువైన కాలాన్ని కోల్పోతోంది.

ఢిల్లీ ఓటర్లు ఎలా స్పందించారో, అంతిమంగా దేశ ప్రజలంతా అలాగే స్పందిస్తారనటంలో నాకెలాంటి సందేహమూ లేదు. కానీ, భారత్ మూస పోసినట్లుండే దేశం, సమాజం కాదు. దేశం వివిధ పొరలలో, వివిధ దశలలో ఉంది. కాలానుగుణమైన, సామాజిక, ఆర్థికపరమైన మార్పులలో ఎన్నో అంతరాలున్నాయిక్కడ. సానుకూలమైన మార్పులకు వాతావరణం అన్ని చోట్లా కనిపిస్తానే ఉన్నా, అవి పక్వమై సాకారమయ్యే పరిస్థితి మాత్రం ప్రాంతం ప్రాంతానికీ మారిపోతూవుంటుంది. కానీ, అటూఇటుగా ఒక దశాబ్ది కాలంలో.. భారత్‌లోని ఎక్కువభాగం కొత్త రాజకీయాన్ని ఆహ్వానించే అవకాశం ఉంది.

ఈలోగా, ఎవరైతే మన విధానాలతో ఏకీభవిస్తానే, తమ 'ఓటు వృధా' అవుతుందనే భయంతో ఇతర పార్టీలకు ఓట్లు వేస్తున్నారో.. ఆ ఓటర్లను ఒప్పించి, లోక్‌సత్తాకు వేసే ఓటు వృధా కాదని నచ్చచెప్పటానికి అవసరమైన వ్యూహాల్ని రూపొందించుకోవాల్సి ఉంది. లోక్‌సత్తాకి రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోను విస్తరించిన ఒక మోస్తరు ఓటు శాతం ఉంది. అది నగరాలలో, పట్టణాలలో ఎక్కువ ఉంటే, గ్రామాలలో తక్కువ ఉంది. కానీ కొన్ని చోట్ల మాత్రమే కేంద్రీకరించిన ఓటు లేదు. ఇప్పుడు రాష్ట్రమంతా విస్తరించిన ఒక మోస్తరు ఓటుని, నిర్దేశించిన నియోజకవర్గాలలో గెలుపు సాధించే ఓటుగా మార్చుకోవటం మనకు అవసరం. ఒక్కసారి ఎన్నికల్లో విజయానికి భరోసా లభిస్తే, ఓటర్లలో నమ్మకాన్ని ప్రోది చేయగల సామర్థ్యం ఉన్న అనేకమంది నాయకులు నియోజకవర్గాలవారీగా 'మార్పు చోదక శక్తి' బాధ్యతలు తీసుకోవడానికి ముందుకొస్తారు.

ఇతర పార్టీలతో వ్యూహాత్మక పొత్తులు, సర్దుబాట్లను తీవ్రంగా ఆలోచించాలని.. వాస్తవాలు, ఆధారాలతో కూడిన ఈ తర్కబద్ధ నేపథ్యం మనకు నిర్దేశిస్తోంది. అయితే, మన మౌలిక విలువల విషయంలో ఎక్కడా రాజీపడకుండా, మన ఎజెండాను స్పష్టంగా లక్ష్మణరేఖలతో పేర్కొంటూ వ్యూహాత్మక పొత్తులకు వెళ్లటం ద్వారా బహుళ పార్టీ ప్రజాస్వామ్యంలో మనం బాధ్యతాయుత రాజకీయ పార్టీగా వ్యవహరించినవారమవుతాం. ఈ వ్యూహాలు మనం నిర్దేశించుకున్న లక్ష్యాల కోసం ఉండాలి. మన వరకు – ఎంచుకున్న మార్గాన్ని తప్పకూడదు. ఈ కారణంగానే మన మొదటి ఎంపికగా ఆమ్ ఆద్మీ పార్టీకి స్నేహహస్తాన్ని అందించాం. కానీ, వాళ్లు గుత్తాధిపత్యపు పాలకుల తీరులో వ్యవహరించారు. వారి అపరిపక్వత ఎలాంటిదో ఈ పాటికే దేశమంతా గుర్తించింది.

నేల విడిచి సాము చేసే పరిస్థితులకి, సమాజం గొడవ పట్టని సంపన్నవర్గాలకి రాజకీయం కేవలం ఒక మేధోపరమైన ఆట. కానీ వాస్తవంలో.. పరస్పర విరుద్ధమైన ప్రయోజనాలని సమన్వయం చేయటానికి రాజకీయం అత్యంత అవసరమైన పవిత్ర వ్యాసంగం అని అర్థమవుతుంది. భయంకరమైన, ఆత్మను క్షోభింపచేసే పేదరికాన్ని అంతం చేయటానికి, విశృంఖల దోపిడీని, మానవ హక్కుల తిరస్కారాన్ని అరికట్టటానికి, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు కల్పించటానికి రాజకీయం అవసరం. దీన్నే సురాజ్యం అంటారు. ఇది

ఆకర్షణీయమైనదో, ఆధ్యాత్మికమైనదో కాదు. దేశాభివృద్ధికి అదో పచ్చి వాస్తవిక అవసరం. ఈ నేపథ్యంలో, ఇతర పార్టీలతో కలసి పనిచేయటానికి మన ప్రాతిపదికల్ని పరిశీలిద్దాం. మన పొత్తులు స్వచ్ఛమైన రాజకీయాలు, భిన్నత్వం, సుపరిపాలన కోసం స్పష్టమైన సంకల్పం ప్రాతిపదికన నడిచే సమాహారంగా ఉండాలి. మరీ ముఖ్యంగా– మన ఆర్థిక, విద్య, ఆరోగ్యం, అవినీతిరహిత, వికేంద్రీకరణ ఎజెండాలకి కట్టుబడి ఉండాలి. ఎన్నికైన ప్రజాప్రతినిధులను సంస్కరణల దిశగా నడిపించి, వాటిని సాధించిన చరిత్ర లోక్‌సత్తాకుంది. ఎన్నికల నిధుల సంస్కరణలు, రాజకీయాల్లో నేరసంస్కృతిని అదుపు చేసే సంస్కరణలను మన సమాజం నిరంతరం ద్వేషించే రాజకీయ నాయకుల ద్వారానే సాధించాం.

అది సాధ్యం. అది సాధ్యమని రుజువైంది. మనం సాధించి చూపాం.

అయినా ఇతర పార్టీలతో ఏరకమయిన సంపర్కం, పొత్తులు లేకుండా ఒంటరి ప్రయాణం చేయటం ఒక్కటే అంగీకారయోగ్యమైన పరిష్కారమని మీరు భావించినట్టయితే, మీ అభిప్రాయాన్ని మేం అంగీకరించక పోయినా గౌరవిస్తాం.

మొత్తం రాజకీయ క్షేత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాక, మనకు ఇప్పుడు రెండు మధ్యేవాద పార్టీల మధ్య ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్, బీజేపీ. సర్దుబాటు అవకాశాలకు ఈ పార్టీలను మన ప్రమాణాలతో అంచనావేద్దాం.

◆ **వంశపారంపర్య, కుటుంబ రాజకీయాలు :** ఈ సిగ్గులేని ఫ్యూడల్ నియంతృత్వం భారత రాజకీయాలపై ప్రగాఢ ప్రభావం చూపుతోంది. భారత ప్రజాస్వామ్యం ఈవేళ పార్టీస్వామ్యం స్థాయికి దిగజారిపోయింది. మనం ఈ దేశానికి కానుకగా ఇచ్చిన 91వ రాజ్యాంగ సవరణని ఎన్నికైన ప్రజాప్రతినిధుల గొంతు నొక్కేందుకు పార్టీల సొంతదారులు, యజమానులు ఉపయోగిస్తున్నారు. పార్టీల్ని వారసత్వ రాజకీయాల నుంచి అంతర్గత ప్రజాస్వామ్యం వైపు మళ్లించటం మన లక్ష్యం కావాలి.

◆ **డబ్బు బలం:** ఓట్ల కొనుగోలు, అక్రమంగా డబ్బు ఖర్చు చేయటం. లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ పార్టీ తప్ప మిగతావారెవరూ ఈ విషయంలో పవిత్రులు కారు. వీరు, వారు తేడా లేకుండా మిగిలిన అన్ని పార్టీలూ రకరకాల రూపాల్లో డబ్బు రాజకీయాలకు పాల్పడుతున్నాయి. కనీసం ఎన్నికల ఖర్చును.. ప్రచారానికే ప్రధానంగా వినియోగించేలా, క్రమక్రమంగా ఓట్ల కొనుగోలు ప్రభావం తగ్గిపోయేలా మనం గట్టిగా ఒత్తిడి తేవాలి.

◆ **తాయిలాల, ఉచితాల సంస్కృతి:** నిజమైన ఆర్థిక అభివృద్ధిని అందించే సత్తా లేక, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి అందించలేక .. తాత్కాలిక తాయిలాలతో పేద, మధ్యతరగతి ప్రజలను సంతృప్తి పరిచే ప్రయత్నం చేస్తున్నారు. మనకి కావలసింది ఆర్థిక ప్రగతి, ఉపాధి కల్పన, ఆదాయాల పెంపు తప్ప తాత్కాలిక తాయిలాలు కావు.

◆ **ప్రజల మధ్య చిచ్చుపెట్టటం:** సంకుచిత, ఓటు బ్యాంకు రాజకీయాలు కులం, ప్రాంతం, మతం, భాష వంటి సామాజిక చీలికలను అగాధాలుగా మారుస్తాయి. ప్రజల్ని చీల్చడంలో కులం, ప్రాంతం కూడా మతంలాగే ప్రమాదకరమైనవని మనం గుర్తించాలి.

ఈ అన్నిరకాల ప్రాతిపదికలలో కాంగ్రెస్ దారుణంగా విఫలమవుతుంటే, బీజేపీ.. మొదటి, మూడవ ప్రమాణాలలో తగిన స్థాయిలో ఉంది. కొంతమేరకు రెండవ ప్రమాణాన్ని కూడా అందుకోగలుగుతోంది. ఇక ఇటీవలి కాలంలో బీజేపీ మతంతో సంబంధం లేకుండా.. ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన, మంచి పాలన దేశానికి నేటి అవసరాలంటూ స్పష్టంగా ప్రజల ముందుకు వస్తున్నది.

అతివాద ధోరణుల్ని సవరించి, ప్రగతి, అభివృద్ధి కోసం ఎజెండాను పరిపుష్టం చేయటం ఒక రాజకీయ పార్టీగా మన ప్రధాన బాధ్యత. ఒక ప్రధాన రాజకీయ పార్టీ తన సంకుచిత, విభజన మతవాద ఎజెండాను విడిచి, ఆర్థికాభివృద్ధిని తన ఎన్నికల ప్రచారరథంగా చేసుకునేందుకు మార్గాన్ని మార్చుకుంటున్నప్పుడు.. ఈ దేశం కోసం మన లక్ష్యాలను సాకారం చేసుకునే అవకాశంగా, తోడ్పాటు నివ్వాల్సిన సందర్భంగా గుర్తించాలి.

ఇక మన తెలుగునాడును గూర్చి, రాబోయే రెండు రాష్ట్రాల భవిష్యత్తును గూర్చి లోతుగా ఆలోచించి మనం పొత్తుల నిర్ణయం తీసుకోవాలి. అవినీతే పునాదిగా ఉన్న పార్టీలతోను, తెలుగునాట సంక్షోభాన్ని సృష్టించిన పార్టీలతోను పొత్తు సాధ్యం కాదు. లోక్‌సత్తా పార్టీ స్పష్టమయిన ఎన్నికల ఎజెండాని ప్రజల ముందు పెట్టింది. అందులో ప్రధానంగా అవినీతిపై పోరాటానికి బలమైన ఏర్పాట్లు, స్థానికంగా గ్రామాలకి, పట్టణాల్లో వార్డులకి తలసరి గ్రాంటులు అందించి అధికారాన్ని ప్రత్యక్షంగా ప్రజల చేతుల్లో పెట్టటం, ప్రమాణాలతో కూడిన విలువైన విద్యను ప్రతి బిడ్డకీ అందించే ఏర్పాటు, రెక్కాడితే డొక్కాడని అసంఘటిత

కార్మికులకి విద్య, ఆరోగ్యం, జీవన భద్రత, వ్యవసాయంలో రైతుకి రేటు ఇచ్చి అదనపు విలువను చేకూర్చే ఏర్పాట్లు, విద్యుత్ రంగాన్ని ప్రక్షాళన చేసి 24 గంటలూ విద్యుత్‌ని అందించటం, వస్తూత్పత్తి రంగంలో పెద్దఎత్తున ఉపాధి కల్పన, మహిళల భద్రతకి ఏర్పాట్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా ప్రజలకు హక్కుగా సేవలందించేందుకు 'పౌర సేవల' చట్టం, మద్యం బారిన పడ్డ కుటుంబాలకి తాగుడు మహమ్మారి నుంచి విముక్తి, హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాల కోసం వనరులు – కీలకమైనవి. మన ప్రాతిపదికల మేరకు ఈ ఎజెండాతో కలిసొచ్చే పార్టీలతో స్థానికంగా పొత్తులకి మనం సిద్ధం కావాలి.

గాంధీ కూడా అలీ సోదరులతో, వారి ఖిలాఫత్ ఉద్యమంతో కలసి పనిచేశారు. కానీ, ఆయన్ని ఆ సంకుచిత ఎజెండా కోసం జరిగిన ఆ పొత్తు ద్వారా అంచనా వేస్తున్నామా.. లేక స్వాతంత్ర్య సాధనకు, ఈ దేశ ప్రజలను సామరస్యంతో కలిపేందుకు చేసిన కృషిని బట్టి అంచనా వేస్తున్నామా? మనం ఒక సమాజంలో జీవిస్తున్నాం తప్ప ఆదర్శమయ ఊహాలోకంలో కాదు. నిర్మాణంలో ఉన్న దేశంలో జీవిస్తున్నాం మనం. ఉన్న పరిస్థితులలో జాతి లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయటం మన కర్తవ్యం. లేదంటే అసాధ్యమయిన అద్భుతం సుసాధ్యమయిన మంచికి శత్రువవుతుంది. సమాజం అంతా మారి, దేశ రాజకీయం అంతా ప్రక్షాళన జరిగేదాకా మనం ప్రేక్షకపాత్ర వహిద్దామంటే, జాతికి చాలా నష్టం వాటిల్లుతుంది. ఆర్థిక వ్యవస్థని, రాజకీయాన్ని గాడిన పెట్టటానికి అనుక్షణం అప్రమత్తంగా మనకున్న అవకాశాల్ని వినియోగించుకోవాలి. ప్రతిరోజు ఆలస్యానికి కోట్లాది సామాన్యులు మూల్యం చెల్లిస్తున్నారని మనం గుర్తించాలి.

ఇక పొత్తులు ఎన్నికల ముందు మంచిదా, ఎన్నికల తర్వాతనా అన్నది ప్రశ్న.

ఒక కార్యాచరణ ప్రాతిపదికన ఎన్నికల ముందు పొత్తు లేదా సర్దుబాటును నైతికమైనదిగా, ప్రజల తీర్పుతో కూడినది కావటం వల్ల విలువైనదిగా.. ఎన్నికల తర్వాత పొత్తుని అనైతికమైనదిగా, అవకాశవాద ధోరణితో కూడినదిగా, ప్రజల ఆమోదం లేనిదిగా పరిణతి చెందిన అన్ని ప్రజాస్వామ్య దేశాలలో సాధారణంగా ప్రజలు భావిస్తారు.

ఈ సమయంలో, పైన పేర్కొన్న ప్రాతిపదికని ఇతర పార్టీలు ఆమోదిస్తాయో లేదో లోక్‌సత్తా కచ్చితంగా చెప్పలేదు. ఒక బాధ్యతగల రాజకీయ పార్టీగా మనం ప్రజల కోసం అటువంటి పొత్తు లేదా సర్దుబాటుకు గల అవకాశాల్ని వెతకాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియను నిబద్ధతతో, నిజాయతీ మార్గంలో పారదర్శకంగా చేపట్టాల్సి ఉంది.

పొత్తు కుదిరితే, భాగస్వాములందర్నీ ఒకే గాటన కట్టాల్సిన అవసరం లేదు. నిజానికి, కూటమిలోని ఒక భాగస్వామిగనక విభజన, విద్వేష రాజకీయాలను మాట్లాడితే, మనం వెంటనే దాన్నుంచి బైటపడతాం. తిరిగి చూడం కూడా. వారి రాజకీయ పంథాని బట్టి, వారి నిర్ణయాలను బట్టి, చర్యలను బట్టి మనం వారి పట్ల వైఖరిని ప్రదర్శించాల్సి ఉంటుంది. వారు చేసే మంచికి సహకరించటం, పొరపాట్లు జరిగితే సరిదిద్దటం, మౌలిక ప్రజాస్వామ్య విలువలను మంటగలిపితే వారిని తిరస్కరించటం – వీటన్నింటికీ మనం సిద్ధపడాలి.

ఏ సర్దుబాటు, పొత్తులు ఉన్నా.. ఈ రాజకీయ అవగాహనతో, లోక్‌సత్తా సైద్ధాంతిక విధానాలకు అనుగుణంగానే ఉంటుంది. లోక్‌సత్తా పొత్తుల కోసం వెంపర్లాడదు. కానీ కలసి పనిచేయటానికి, చర్చించటానికి సంకోచించదు.

ఎప్పుడైనా దేశ అవసరాలకు తగ్గట్టు వ్యవహరించటమే లోక్‌సత్తా తొలి ప్రాధాన్యత. పార్టీ అవసరాల కోసం దేశ అవసరాలను ఎప్పుడూ తాకట్టు పెట్టం.

ఇది నాకు ఒక సంక్లిష్ట ప్రయాణం. ముగించే ముందు, దీని మీద లోతుగా ఆలోచించి, కొత్త రాజకీయాన్ని కొనసాగిస్తూ ప్రజాప్రయోజనాల్ని పెంపొందించేందుకు ఒక ఆచరణాత్మక వ్యూహాన్ని వెలువరించాలని నా లోక్‌సత్తా సహచరులకు విజ్ఞప్తి చేస్తున్నాను. లోక్‌సత్తా సహచరులు సమాజంలో అరుదైన వ్యక్తులు. సమాజం రాజకీయాన్ని అంటరానిదిగా భావిస్తున్న కాలంలో మీరంతా రాజకీయ ప్రక్షాళన ఉద్యమంలో భాగస్వాములయ్యారు. రాజకీయాన్ని పవిత్ర వ్యాసంగంగా ఎంచుకున్నారు. అందుకు లోక్‌సత్తాని వేదికగా చేసుకున్నారు. మనం మౌలిక విలువల విషయంలో, దేశ ప్రయోజనాల విషయంలో ఏనాటికీ రాజీ పడం. ఈ సంకల్పంతో, ఆచరణతో, దృఢ విశ్వాసంతో ఈ దేశానికి ఎన్నో ఫలితాలను సాధించాం. అదే సంకల్పంతో, విశ్వాసంతో నిస్సంకోచంగా నడుద్దాం. మన ప్రజాస్వామ్యాన్ని మారుద్దాం. యువతరం ఆశల్ని నెరవేరుద్దాం.

**(జేపీ రాసిన ఈ పత్రం ఆంగ్ల మూలాన్ని www.loksatta.org వెబ్‌సైట్‌లోని పబ్లికేషన్స్ మెనూలో చదవవచ్చు)** ౭

# డాక్టర్లు-ఇండియా-అమెరికా

**- ఎ. అన్నపూర్ణ,** కాలిఫోర్నియా

***జాతీయాదాయంలో 2-3శాతం వ్యయంతోనే 'అందరికీ ఆరోగ్యాన్ని' అందించే ఆరోగ్య విధానాన్ని రూపొందించి కేంద్రప్రభుత్వానికి అందించిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్.. ప్రస్తుతం వైద్యులకు-ప్రజలకు మధ్య అంతరాన్ని తగ్గించే ఏర్పాట్ల కోసం కృషి చేస్తున్నారు. ఈ అంతరం సమాజానికి ప్రమాదకరమనటంలో సందేహం లేదు. వైద్యులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలుంటే.. చికిత్స వ్యయంతోపాటు జబ్బులు కూడా త్వరగా తగ్గే అవకాశముంది. ఈ కృషిలో భాగంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు, పౌరసమాజంలో అవగాహన కలవారితో జేపీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి ప్రయత్నం గురించి సమాజంలో పెద్ద ప్రచారం ఉండకపోవచ్చు. కానీ ఎంతో విలువైన, అవసరమైన కృషి ఇది. అందుకే.. నా వంతుగా ఈ వ్యాసం. ప్రజలకు, వైద్యులకు సంబంధించిన అంశాలపై నాకు తెలిసిన వివరాలను ఇక్కడ అందిస్తున్నాను..***

డాక్టర్ అంటే తమ పాలిట దైవంగా భావిస్తారు ప్రజలు. అనారోగ్యం వచ్చి ఆసుపత్రిలో చేరితే వైద్యుడి మీద కొండత భరోసాతో వుంటారు. కానీ వైద్యవృత్తికే కళంకం తెచ్చేవారుగా తయారయ్యారు కొందరు వైద్యులు. ధనవంతులు ఏదోకరకంగా డబ్బు ఖర్చు చేసి డాక్టర్ కోర్సు చదువుతున్నారు. మెరిట్లో సీటు సంపాదించగలిగినవారు అతి తక్కువ మంది వుంటారు. అటూఇటూ కాని మధ్యతరగతివారు కొంత బ్యాంకు రుణం తీసుకొని చదివించటానికి కష్టపడు తున్నారు. ఏ దేశంలో అయినా మెడికల్ కోర్సు చేయాలంటే అత్యంత ఖరీదైన విద్య. డాక్టర్‌గా డిగ్రీ తీసుకున్న తర్వాత వృత్తిలో నైపుణ్యత సాధించటానికి కొంతకాలం పడుతుంది. ఆ తర్వాత ప్రావీణ్యత, ప్రవర్తన ద్వారా జబ్బులు నయం చేయడంలో ప్రత్యేక పంథా ద్వారా ఒక స్థాయికి చేరి మంచి పేరు తెచ్చుకో గలుగుతారు. అంతేకాదు, వ్యాధి నిర్ణయంలో, తగిన సలహాలు ఇవ్వడం, రోగికి ఉపశమనం కలిగించే తీరులోనూ ఎన్నో బాధ్యతలు ఉంటాయి. అవన్నీ సక్రమంగా జరిగినప్పుడే వైద్యుని మీద నమ్మకం అంటూ ఏర్పడుతుంది. ఆ వైద్యుని మీద విశ్వాసం కలిగిన తర్వాత ఫ్యామిలీ డాక్టర్‌గా ఏర్పాటు చేసుకుని క్రమం




తప్పకుండా ఆయన/ఆమె సూచించిన విధంగా పరీక్షలు చేయించుకోవాలి. ఇలా చేయడం వలన వైద్యునికి రోగి శరీరం తీరుపై అవగాహన ఏర్పడి ట్రీట్‌మెంట్ చేయటం సులువవుతుంది. ఒక కుటుంబంలో 4గురు సభ్యులు (భార్య, భర్త, ఇద్దరు పిల్లలు) సామాన్యంగా పరీక్షలు చేయించుకుంటే రూ. 5వేలు అవుతుందని అనుకుందాం. ఒకేసారి ఇంత డబ్బు ఖర్చు చేయలేనప్పుడు పెద్దలు ఒకసారి, పిల్లలు మరోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవచ్చు. సాధారణంగా ఇంటి యజమాని పనిచేసే ఆఫీస్ కంపెనీ, ప్రభుత్వ సంస్థల ద్వారా ఇన్సూరెన్స్ ఉంటుంది. లేకపోతే ప్రయివేటుగా ఎవరికివారే ఇన్సూరెన్స్ కట్టు కుంటుంటారు. బ్యాంకులు కూడా ఈ సదుపాయాన్నిస్తున్నాయి. సాధారణంగా మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించరు. ఏదైనా తేడా వచ్చినప్పుడే తప్పని పరిస్థితిలో డాక్టర్ దగ్గరికి వెళతారు. బీమా సదుపాయం లేనివారు ఖర్చు గురించి భయపడతారు (బీమా మీద ఆధారపడిన అమెరికా ఆరోగ్య విధానం విఫలమైంది. ఆరోగ్య విధానంలో బీమా పరిమితులు ఏరకంగా ఉండాలన్నది వేరే చర్చ). మరోకారణం ఏమంటే, డాక్టర్లు అక్కర్లేని పరీక్షలు చేయించి డబ్బు ఖర్చు చేస్తారు అనే అనుమానం ఉంటుంది. అలాంటి భయాలు సందేహాలు అవసరం లేకుండా ఫ్యామిలీ డాక్టర్ వుంటే భరోసా లభిస్తుంది. పబ్లిసిటీ కోసం ప్రకటనలు ఇచ్చేవారిని నమ్మరాదు. స్నేహితులూ బాగా తెలిసినవారి సలహాల ప్రకారం డాక్టర్‌ని ఎంచుకోవాలి. వంశపారం పర్యంగా వచ్చే వ్యాధులు, దీర్ఘకాలంగా వేధించే జబ్బుల విషయంలో కుటుంబ వైద్యులు మంచి

సలహాలు ఇవ్వ గలుగుతారు. సంవత్సరానికి రెండుసార్లు లేదా అవసరాన్ని బట్టి పరీక్షలు చేయించుకోమని సూచిస్తారు. ఈ పరీక్షల ఫలితాలను బట్టి సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఏదీ ప్రాణాంతకం కాదు. పూర్వం రోజుల్లో ఇంతమంది ప్రత్యేక వైద్యులు లేరు. ఒక వయసు వరకూ బైటపడని జబ్బులు ఇప్పటిరోజుల్లో బిడ్డ పుట్టకముందే నిర్ధారణ చేసి తగు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది. అంటే అద్భుతమైన సదుపాయాలు వచ్చాయి. కొద్దిపాటి ఖర్చుతో ముందుగానే చేసే పరీక్షలు మానవాళికి ఎంతో వూరటను కలిగిస్తూ ప్రాణదానం చేయటం ఆధునిక వైద్యవిజ్ఞానం సాధించిన ప్రగతి. ఇదంతా ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోగల అవకాశం.

చాలాకాలంగా కొందరు వైద్యులు రోగుల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యం, దారుణ ప్రవర్తన పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాల్సిన అవసరం ఉంది. ఆధునికత పెరుగుతున్నా, జనం అప్పులు తీసుకుని మరీ వైద్య బిల్లులు చెల్లిస్తున్నా ఈ తరహా వైద్యుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. డాక్టర్ల నిర్లక్ష్యానికి కారణాలు కేవలం డబ్బు సంపాదన దృష్టి, నైపుణ్యత లేని డిగ్రీలు. హాస్పిటల్లో బోర్డు మీద విదేశీ డిగ్రీలు కనీసం అయిదారు ఉంటాయి. కాస్తంత శ్రద్ధ పెట్టి ఆలోచిస్తే, ఆ డిగ్రీలు చదవడానికి పట్టిన కాలం ఆ డాక్టర్ వయసుతో పోలిస్తే అబద్ధమని తెలిసిపోతుంది. ఆరునెలలు, మూడు నెలల కోర్సు చేసినవారికీ ఇచ్చేవి సర్టిఫికెట్లు తప్పితే డిగ్రీలు కావు. ఒకవేళ చదివి తెచ్చుకున్నా అనుభవం తగినంత ఉండని సందర్భాలనూ పరిగణలోకి తీసుకోవాలి. సామాన్యంగా ప్రజలు ఆ బోర్డు చదివి, అబ్బా, ఈ డాక్టర్‌గారికి ఎన్ని డిగ్రీలు (సర్టిఫికెట్లు) వున్నాయో, అదీ ఫారిన్‌వి అనుకోవాలి తప్పితే, అవి నిజమైనవో కావో ఇచ్చినవారికీ పుచ్చుకున్నవారికి మాత్రమే తెలియాలి. నా అనుభవంలోనే చాలా జరిగాయి. నాకు అమెరికాలో డాక్టర్ (ఫ్యామిలీ డాక్టర్) పరీక్షలు చేసినప్పుడు బి 12 లోపం ఉన్నట్టు చెప్పి ప్రతినెలా ఇంజక్షన్లు తీసుకోవాలని 6నెలలకోసారి వాటి లెవెల్స్ చెక్ చేసుకోవాలని చెప్పారు. అమెరికాలో చేసిన టెస్టులో 400 మాత్రమే ఉంది. సంవత్సరం తర్వాత కూడా మెరుగుపడలేదు. సరే ఎటూ షాట్స్ తీసుకుంటున్నాను గదా అని ఇండియా (హైదరాబాద్) వెళ్లినప్పుడు ఒక ప్రముఖ హాస్పిటల్ జనరల్ మెడిసిన్ డాక్టర్‌గారి ప్రిస్క్రిప్షన్‌తో టెస్ట్ చేయించుకున్నాను. 1500 ఉన్నట్టు రిపోర్టు వచ్చింది. నాలుగు నెలలూ ఇంజక్షన్లు చేయించుకుని అమెరికా వచ్చేశాను. వచ్చిన వెంటనే ఇక్కడ మళ్లీ టెస్టు చేశారు. ఇండియాలో టెస్టు చేసిన కేవలం రెండు వారాల తర్వాత 800 ఉంది. అంటే ఏమనుకోవాలి? ఇది చిన్న ఉదాహరణ మాత్రమే. మరేదైనా ప్రాణాంతకమైన వ్యాధి అయితే పేషెంట్ మానసిక స్థితి ఏమవుతుంది? ఇందులో ఎవర్ని బాధ్యుల్ని చేయాలి? డాక్టర్‌కి, లేబరేటరీకి, టెక్నీషియన్లకి మధ్య ఉండే తేడానా? సమన్వయలోపమా? లేక పేషెంట్ దౌర్భాగ్యమా?.. హైదరాబాద్‌లో మా బంధువు ఒకరు డయాబెటిక్ పేషెంట్. ఒక డాక్టర్‌గారు గుండె కవాటాల్లో ఒకటి పూర్తి బ్లాక్ ఉందని, మరొకటి 75 శాతం బ్లాక్ ఉందని సర్జరీ సూచించారు. మా బంధువు సెకండ్ ఒపీనియన్ తీసుకుంటే, ఆ ప్రముఖ కార్డియాలజిస్ట్ మళ్లీ అవే టెస్టులు చేయించి ఫలానా ల్యాబ్‌లో రిపోర్టు తెచ్చుకోమన్నారు. అవి చూసి ఆపరేషన్ అవసరం లేదు, మందులతో నయం చేయవచ్చు, బ్లాక్స్ ఏమీ లేవు అన్నారు. మా బంధువు ఎగిరిగంతేసినంత ఆనందపడిపోయి ముందు చెప్పిన డాక్టర్‌ని హేళన చేశాడు (విచిత్రం.. రోగికి ప్రాణాపాయమున్నా నీకేం లేదని చెప్పినవారి మాటనే ఎక్కువమంది నమ్ముతారు). ధైర్యంగా ఇష్టమొచ్చినట్టు అన్నీ తినటం, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయటం చేశాడు. సంవత్సరం తిరగలేదు మూడు బ్లాక్స్ ఉన్నాయని తేలింది టెస్టులో. అప్పుడు మూడో డాక్టర్ దగ్గరికి వెళ్లి బైపాస్ చేయించుకున్నాడు. కిమ్స్, కేర్, స్టార్ ఇలా ఆ ప్రముఖ ఆసుపత్రుల పేర్లు అనవసరం ఇక్కడ. ఆ వైద్యులు ప్రముఖులు కాబట్టి నిరూపించలేరు పేషెంట్లు. ఇలా డాక్టర్ చెప్పినట్టు రిపోర్టులు తయారుచేసే డయాగ్నొస్టిక్ సెంటర్లు ఉన్నాయి. అవి కూడా నాకు తెలుసు. అయినా ఏమీ చేయలేని దుస్థితి. మనదేశంలో చట్టాలు, చట్టబద్ధ పాలన సరైనరీతిలో లేవు. మార్ఫిన్ తీసుకున్నట్టు నిద్రమత్తులో మన చట్టాలు పనిచేస్తుంటాయి. పైనున్న కొద్దిమంది వ్యక్తుల చెప్పుచేతల్లో వుంటాయి. అవసరం వచ్చినప్పుడు ఎంపికచేసుకున్నవారి కోసం అప్పుడప్పుడూ ఒక్కసారి కళ్లు తెరుస్తాయి.

అమెరికాలో నాకు తెలిసిన డాక్టర్లు ఎక్కువమందే ఉన్నారు. వాళ్లు ఎన్నేళ్లుగానో స్థిరపడిపోయారు. మా కుటుంబంలో ఇద్దరు ఫ్రెష్‌గా చదివినవారు అమెరికాలో వైద్య వృత్తి గురించి వివరించారు. నేనూ 20 సంవత్సరాలుగా గమనిస్తూ వచ్చాను. తెలిసిన, తెలుసుకున్న ఆ విషయాలను చెబుతాను. కష్టపడి చదివి ఎంట్రెన్స్ రాసి డిగ్రీ తీసుకుని స్పెషలైజేషన్ చేసేవరకూ చెప్పాలంటే మహాయజ్ఞంలాంటిది. ప్రతీ సంవత్సరం పరీక్షలు కేసులకు అర్ధరాత్రయినా అటెండవటం (ఎమర్జెన్సీ కేసులు), ట్రైనింగ్ క్లాసులు ఇలా చాలా కష్టపడతారు. రికమండేషన్–హెల్ప్–సపోర్ట్ ఇలాంటివి ఏవీ వుండవు సరికదా, పై అధికార్ల పర్యవేక్షణ ఉంటుంది. నిద్రలో లేపి నువ్వు అటెండ్ అయిన ఫలానా పేషెంట్ పరిస్థితి గురించి చెప్పమంటే.. సమాచారం ఇవ్వాలి. సీరియస్ కేసుల్లో తరచూ కండిషన్ గురించి తెలుసుకుంటూ వీడియో

కాన్ఫరెన్స్‌కి అందుబాటులో ఉండాలి. నర్స్‌లకు తగిన సలహాలివ్వాలి. ఇలా 8 సంవత్సరాల పాటు శ్రమ ఒత్తిడి, అంకితభావంతో చదవాల్సి ఉంటుంది. వివాహం అయిన తర్వాత పిల్లలు, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ చదువుకుంటున్నవారున్నారు. మొదట ఇంజినీరింగ్ డిగ్రీతో ఇండియా నుంచి అమెరికా వెళ్లి 15 సంవత్సరాల పాటు ఉద్యోగం చేసి ఆ తర్వాత దీక్షతో పట్టుదలతో డాక్టర్ కోర్సు చదివినవారున్నారు. ఇదంతా చదువుకునే అంశంలో భాగం.

ఇక అంతా పూర్తి చేశాక వృత్తిలో ప్రవేశించటం జరుగుతుంది. హాస్పిటల్లో ఉద్యోగ బాధ్యతలు ప్రారంభమవుతాయి. ఇదీ అంత సులువు కాదు. పేషెంట్ శారీరక పరిస్థితి, ఒక జబ్బు ఒక్కో రోగి మీద ఎలా రియాక్ట్ అవుతుంది, వాటి అనుభవాలు, ఏ ట్రీట్‌మెంట్‌తో తగ్గుముఖం పట్టింది, పూర్తిగా నయమవుతుందా, కేవలం తాత్కాలికంగా అదుపులో ఉండి మళ్లీ తిరగబెడుతుందా.. వీటిని గురించిన అవగాహనతో రిపోర్టులను ఎప్పటికప్పుడు తయారుచేసి పై అధికారులకు ఇవ్వాలి. సెమినార్లు, మీటింగులలో చర్చలుంటాయి. పేపర్లు సమర్పించాలి. వైద్యకళాశాల్లో టీచింగ్‌కి అటెండవుతుంటారు. ఇంత కష్టపడి పనిచేస్తున్నా ఏదో ఒక ఇబ్బంది, ఆటంకమూ కలగవచ్చు. తప్పు డాక్టర్‌దా, నర్స్‌దా, టెక్నీషియన్‌దా, పేషెంట్‌దా తెలియాలంటే రూల్స్ ప్రకారం విచారణకు హాజరుకావలసిందే! డబ్బుకి ఆశపడి అక్రమాలు చేస్తే, అవి నిరూపణ అయితే, మొదట డాక్టర్ డిగ్రీ రద్దవుతుంది. నష్టపరిహారంగా ఫైన్ కట్టటమే కాదు, సంపాదించిన ఆస్తినంతా స్వాధీనం చేసుకుంటారు. ఇలా మిలియన్ల డాలర్ల ఆస్తుల్ని జప్తు చేసిన ఘటనలు ఉన్నాయి. భారతీయ వైద్యులు కూడా ఇలా దొరికారు. ఇక్కడ డాక్టర్ వృత్తి కత్తి మీద సాము లాంటిది. అధ్యయనం, సేవాభావం, జవాబుదారీతనం ఉండాలి. ఇక ఫార్మసీ–మెడికల్ షాపులు. ఫార్మసీలో డిప్లొమో డిగ్రీ తీసుకున్న వారికి మాత్రమే వీటిని అమ్మే లైసెన్సు ఇస్తారు. ఎవరి పేరు మీదనో సంవత్సరాల తరబడి నడిపే అవకాశం అమెరికాలో ఉండదు. నిబంధనలు ఖచ్చితంగా అమలవుతాయి. మీరు ఎక్కడ నివాసం ఉంటే అక్కడ మాత్రమే ఇన్సూరెన్స్ వున్నవారికి ఉచితంగా మందులు ఇస్తారు. అన్ని చోట్లా ఇవ్వరు. డాక్టర్ సూచించిన మందులను నర్స్ నివాసానికి దగ్గరలో ఉండే ఫార్మసీకి మెయిల్ ద్వారా పంపుతారు. ఆ మందుల మీద రోగి పేరు, పుట్టిన తేదీ, డాక్టర్ పేరు స్పష్టంగా ప్రింట్ కాబడి వుంటాయి. జనరిక్ మందులనే సిఫార్సు చేస్తారు. మనం చికిత్స కోసం హాస్పిటల్లో అడుగుపెట్టిన తర్వాత ఎవరెవరు మనకి సేవలు చేస్తారో వారిలో ఏ ఒకరి మీద అయినా ఏమైనా తేడాలు వస్తే కేసులు పెట్టగల హక్కు మనకి వుంటుంది. నిరూపితమైతే, మిలియన్ల డాలర్ల నష్టపరిహారం చెల్లించాల్సి వుంటుంది. కనుక స్టాఫ్ అత్యంత శ్రద్ధతో సేవ చేస్తారు. తప్పు ఏమైనా తేలితే జీవితంలో తిరిగి వాళ్లు ఆ వృత్తి చేయడానికే అనర్హుల్ని చేసే చట్టాలు అమలవుతుండటం వల్ల చాలా జాగ్రత్తగా ఉంటారు. మన బాధ్యతను మనం నిర్వహిద్దాం అనుకునేవారికి అమెరికాలో ఎలాంటి సమస్యా రాదు. మనదేశంలో దీనికి విరుద్ధంగా జరుగుతుంటుంది. అన్ని హాస్పిటళ్ల గురించి కాదుగానీ, కొన్నిటి గురించి మాత్రం చెబుతున్నాను. అయితే సంఖ్యాపరంగా మనదేశంలో మంచి ఆసుపత్రులు తక్కువ. అక్రమాలు జరిపేవి ఎక్కువ. అలాంటి ఆసుపత్రుల గురించి ఈమధ్య తరచూ వింటున్నాం. మీడియాలో చూస్తున్నాం. అక్కడి వైద్యుల మీద ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం, పలుకుబడి డబ్బు వల్ల వారిని తప్పించటం విచారకరం. మానవ శరీరంలోని ఏ భాగాన్ని అయినా అమ్ముకోవడానికి సిద్ధపడటం, డెడ్‌బాడీకి చికిత్స చేస్తూ లక్షలు దండుకోవటం, చిన్నపాటి అనారోగ్యాన్ని పెద్ద జబ్బుగా ప్రాణాంతకమని భయపెట్టి నెలల తరబడి ట్రీట్‌మెంట్ చేయటం వంటి వాటికి పాల్పడుతూ అడ్డదారుల్లో సంపాదనే ధ్యేయంగా వైద్యవృత్తికే కళంకం తెస్తున్నవారున్నారు.

ప్రముఖ ఆసుపత్రుల్లో మెషీన్లు పాడైపోయినా ఏళ్ల తరబడి అలాగే వుంచి మరో ఆసుపత్రిలో టెస్ట్ చేయించుకోమంటారు. మాకు తెలిసినవారు అమెరికాలో పనిచేసి రిటైరయ్యాక ఇండియాలో వుండాలని వచ్చారు. ఆవిడకి అనారోగ్యం చేస్తే హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ఆసుపత్రి వైద్యుడొకరు మరో ప్రముఖ ఆసుపత్రికి పెట్ స్కాన్ చేయించమని పంపించారు. ఆ స్కాన్‌కి ముందు ఎలాంటి ఆహారమూ తీసుకోకూడదు. కనుక ఉదయం 9గంటలకు వెళ్లి బిల్లు చెల్లించారు. టెక్నీషియన్లు గంటల తరబడీ కూర్చోబెట్టి.. మెషీన్ పాడైంది, రేపు రండి అన్నారు. అదేమిటండీ, ముందుగా ఎందుకు చెప్పలేదంటే.. మీ ముందు పేషెంట్ వరకూ పనిచేసింది అన్నారు. తిట్టుకుంటూ మర్నాడు ముందుగా ఫోన్ చేసి మరీ వెళ్లారు. మళ్లీ 2గంటలు కూర్చోబెట్టి, రికార్డు చేసే పరికరం పాడైంది, రేపు మళ్లీ రమ్మన్నారు. ఆవిడ అసలే దయాబెటిక్. కళ్లు తిరిగి స్పృహ తప్పే పరిస్థితిలో ఈ కబురు విని కోపం వచ్చి గొడవపడ్డారు. 'ఒకసారి పే చేశాక డబ్బు వెనక్కి ఇవ్వడమా? నువ్వెంత అమాయకురాలివి..' అన్నట్టుగా చూసి రేపురా, లేకపోతే మానుకో అన్నారు. ఆమెకు, ఆమెతో పాటు వెళ్లినవారికి ఏం చేయాలో తోచక తమను అక్కడికి పంపిన మరో ప్రముఖ ఆసుపత్రి వైద్యునికి ఫోన్ చేశారు. ఆయన ఏదోలా నచ్చచెప్పి మర్నాడు తప్పకుండా చేసేలా ఏర్పాటు చేశారు. చివరికి మూడో రోజు పూర్తి చేసి

రిపోర్టు డాక్టర్‌కి పంపించారు. అందులో.. ఏమీ లేదు, అంతా బాగానే ఉందని చెప్పాక వాళ్లు ఇంటికి వెళ్లారు. పెట్ స్కాన్ అనేది మొత్తం శరీరంలో ఎక్కడైనా క్యాన్సర్ ఉంటే తెలియచేసే పరీక్ష. దానికి రూ. 35,000 వసూలు చేశారు. సరే, డబ్బు పోతే పోయింది, ఏం లేదు కదా అని వాళ్లు సంతోషపడ్డారు. ఆ టెక్నీషియన్లని క్షమించేశారు.

నెల రోజుల తర్వాత వాళ్లు పని పడి అమెరికా వెళ్లారు. వెళ్లేటప్పుడు పెట్ స్కాన్ రిపోర్టుని కూడా తీసుకెళ్లి వాళ్లకి తెలిసిన, ఇంటి పక్కనే ఉన్న డాక్టర్‌కి చూపించారు. ఆయన తెల్లమొహం వేశాడు ఆ రిపోర్టును చూసి! ఎందుకంటే పెట్ స్కాన్ ఫోటో నడుం వరకు మాత్రమే వచ్చిందట. మొత్తం శరీరం రాలేదు. ఆ డాక్టర్ కూడా ఇండియన్ కాబట్టి పరువు అమెరికా బజారున పడలేదు (ఇండియాలో ఇది మామూలే అని పాపం ఆ డాక్టర్‌కీ తెలియదు. వాళ్లెప్పుడో 40 ఏళ్ల క్రితమే అమెరికా వెళ్లి స్థిరపడిపోయారు).


ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంఘటనలున్నాయి. ఒకప్పుడు గ్రామాల నుంచి వచ్చినవారిని, చదువులేని పేదలను మోసం చేసేవారని అనుకుంటుండేవాళ్లం. ఆరోగ్యశ్రీ పథకం వచ్చాక ఎలాంటి వారినీ వదలటం లేదు. ప్రతీ ఊళ్లో ఆసుపత్రుల దళారులు తయారయ్యారు. ప్రభుత్వాసుపత్రుల్లో చేరినవారిని కూడా దళారుల ద్వారా ప్రయివేటు ఆసుపత్రులకు రప్పించి మరీ దండుకుంటున్న ఉదంతాలెన్నో. చనిపోతాడని తెలిసిన వ్యక్తికి స్టెంట్ వేస్తే చాలు లక్షా యాభై వేలు గ్యారంటీ. ఇలాంటి అక్రమాలకు అంతే లేదు. డబ్బు కోసం గడ్డి తినే వీరి నుంచి ప్రజలను రక్షించేవారెవరు? మొదట్లో ప్రభుత్వ వైద్యశాలలకు మాత్రమే అనుమతినిచ్చి ఆ తర్వాత ఏ మహానుభావుడికి బుద్ధి పుట్టిందో ప్రయివేటు ఆసుపత్రులకు వరంగా ఇష్టమొచ్చినట్టు స్కీముని అమలుచేశారు. నష్టపోతున్నది ప్రజలు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. ప్రభుత్వానికి ఈరకంగా పన్నులు డబ్బులు చెల్లించిన ప్రజలు తమ ఆరోగ్యం కోసం అప్పుల పాలవుతున్నారు. దీనికి విరుగుడు లేకపోలేదు.

బాగా పరిచయం ఉన్న నిజాయతీ పరుడైన డాక్టర్ ఒకరిని ఈ దుస్థితి ఎందుకు అని అడిగితే ఆయన చెప్పారు– హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ల మీద కొన్ని నిబంధనలు విధిస్తారు. ఖరీదైన పరికరాలు కొన్నందుకు ఏదో విధంగా వాడాలి కనుక, ప్రతి నెలా విధిగా ఆ టెస్ట్ రాసి తీరాలి. ఇన్ని కేసులని చేయాలి. ఇన్ని ల్యాబ్ టెస్టుల ద్వారా ఇంత ఆదాయం చూపించాలి. వాటితోపాటు హాస్పిటల్‌కి మంచి పేరు తీసుకురావాలి. అలా అయితేనే ఆ డాక్టర్‌కి హెచ్చు పేమెంట్. నిజాయతీగా టెస్టులు రాస్తే ఉద్వాసన తప్పదు అంటూ ఆయన నిస్సహాయత వెల్లడించారు. ఎవరి బాధ వాళ్లదే కావచ్చు, కానీ 'రాక్షసత్వం', 'దోపిడీ', 'నిర్దాక్షిణ్యం' అనేవి వైద్యవృత్తిని దిగజార్చకూడదు. అంతకన్నా వారు ఆ వృత్తిని మానుకోవటం సమాజ శ్రేయస్సుగా అనుకోవచ్చేమో.

ఈ మొత్తం పరిస్థితిని బేరీజు వేశాకే లోక్‌సత్తా తక్కువ బడ్జెట్‌లో, ప్రజల జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా 'అందరికీ ఆరోగ్యం' విధానాన్ని రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందించింది. ఇందులో బీమా పాత్ర పరిమితంగా ఉంటుంది. ప్రజలకు వ్యక్తిగత ఖర్చు లేని నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావటంతోపాటు వైద్యుల్ని జవాబుదారీ చేసే వ్యవస్థ కూడా పకడ్బందీగా ఉంటుంది. లోక్‌సత్తా విధానంలో ప్రధానాంశం– ఈ వ్యాసంలో పైన కీలకంగా చెప్పుకున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం! ప్రజలు తమకు నచ్చిన ఫ్యామిలీ డాక్టర్‌ని ఎన్నుకునే అవకాశాన్ని లోక్‌సత్తా నమూనా కల్పిస్తుంది. దీనివల్ల వారు చాలా వ్యాధులు రాకుండానే నివారించుకోవచ్చు, ఒకవేళ జబ్బు వచ్చినా తొలి దశలోనే నయం చేసుకోవచ్చు. కొద్దిమందికి పై దశ ట్రీట్‌మెంట్ కావాలంటే, ఎవరి దగ్గరికి వెళ్లాలి, ఏరకమైన టెస్టులు చేస్తున్నారు, ఆ టెస్టులు అవసరమా, వైద్యం తీరు ఎలా వుంది తదితర అంశాల మీద కూడా ఫ్యామిలీ డాక్టర్లు సూచనలిస్తారు. దీనివల్ల దోపిడీ బారినపడకుండా, మోసపోకుండా చికిత్స పొందవచ్చు. ఫ్యామిలీ డాక్టర్ల సూచన మేరకే ప్రభుత్వ–ప్రయివేటు భాగస్వామ్యం తో లోక్‌సత్తా నమూనాలో వైద్యసేవ లుంటాయి. తృతీయ దశ వైద్యంలో ఖర్చు ఎక్కువ కాబట్టి అక్కడ పూర్తిగా ప్రభుత్వ వైద్యమే అందిస్తారు. జనరిక్ మందులను సిఫార్సు చేస్తారు. 2005లో డా॥ జేపీ జాతీయ ఆరోగ్య మిషన్‌ను రూపొం దించటంలో కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత వివిధ దేశాల అనుభవాలన్నిటినీ అధ్యయనం చేసి తాజా పరిస్థితుల కనుగుణంగా అందరికీ ఆరోగ్యాన్ని అందించే జాతీయ విధానాన్ని ఇప్పుడు మళ్లీ ఇప్పుడు లోక్‌సత్తా రూపొందించింది. మనదేశంలో కంటే మెరుగైన డాకర్ల వ్యవస్థ (ఇక్కడ క్రమశిక్షణతో వైద్యసేవలు చేసే డాక్టర్లలో ప్రవాస భారతీయులు పెద్దసంఖ్యలో ఉన్నారు) ఉన్న అమెరికాలో కంటే మెరుగైన వైద్య, ఆరోగ్య వ్యవస్థను భారతదేశ బడ్జెట్ పరిమితులకనుగుణంగా లోక్‌సత్తా అందించింది. లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడితే ఈ దేశ ప్రజలందరికీ ఎంతో మేలు జరుగుతుంది.

# 'చేతులు శుభ్రం చేసుకోవటం'.. నేర్పించటానికి వందల ఏళ్లుగా పోరాటం


ఇగ్నజ్ సెమెల్వీస్.. హంగరీ దేశానికి చెందిన ఒక డాక్టర్. 1840ల కాలంలో వైద్యుడిగా ప్రాక్టీస్ చేశారు. చెడుగాలి, దెయ్యాల వల్ల అనారోగ్యం వచ్చిందని అనుకుని చికిత్స అందించే దశ నుంచి.. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించే వైద్యులు పెరుగుతున్న రోజులవి. సెమెల్వీస్ (ఫోటోలో చూడవచ్చు) కూడా అలా శాస్త్రీయ ఆధారాలతో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు ఆరాటపడుతుండేవారు. 1846లో వియన్నాలోని జనరల్ ఆసుపత్రిలో ఆయన డేటాను సేకరిస్తుండేవారు. ప్రసూతి వార్డుల్లో కాన్పు జరుగుతున్నప్పుడు చైల్డ్ బెడ్ జ్వరంతో పలువురు మహిళలు చనిపోతుండటం ఆయన గమనించారు. మహిళా నర్సులు కాన్పులు నిర్వహించే వార్డులో కంటే.. మగ డాక్టర్లు, వైద్యవిద్యార్థులు ఉన్న వార్డులో ఐదు రెట్లు ఎక్కువమంది చనిపోవటాన్ని సెమెల్వీస్ గుర్తించారు. మహిళల కాన్పు భంగిమను, కాన్పు సమయంలో గంట మోగించటం వంటి పద్ధతుల్నీ మార్చి చూశారు. కానీ ఏమీ లాభం లేకపోయింది. చాలా మథించాక.. చివరికి తర్వాత ఆయనకు ఒక స్పష్టత వచ్చింది. డాక్టర్లు, విద్యార్థులు అటాప్సీ చేసి, ఆ చేతులతోనే కాన్పు చేయటం వల్ల.. బిడ్డ ప్రసవ సమయంలో మహిళలకు ఆ చేతుల్లో చేరివున్న పదార్థాలు సోకి చైల్డ్ బెడ్ ఫీవర్‌కి గురై చనిపోతున్నారు. దీంతో, క్లోరిన్‌తో చేతులు కడుక్కుని కాన్పు చేయాలని మగ డాక్టర్లను, వైద్యవిద్యార్థులను సెమెల్వీస్ కోరారు. ఈసారి ఆయన అంచనా తప్పలేదు. కాన్పు మరణాలు తగ్గుముఖం పట్టాయి.



సూక్ష్మక్రిములు వంటి అంశాలేవీ తెలియకపోయినా కేవలం ఇంగితజ్ఞానంతో సెమెల్వీస్ ఇచ్చిన సూచన అనేకమంది ప్రాణాలను కాపాడుతున్నా, తోటి వైద్యులకు మాత్రం ఆగ్రహం తెప్పించింది. సెమెల్వీస్ ముక్కుసూటితనంతో పదేపదే ఆ విషయాన్ని చెప్పటాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. దాంతో ప్రజలకు పనికొచ్చే సలహా ఇచ్చిన డాక్టర్‌కి పలువురు ప్రముఖ శత్రువులు తయారయ్యారు. తమ మూలంగా మహిళలు మరణిస్తున్నారంటూ సెమెల్వీస్ ప్రచారం చేస్తున్నాడని ఆరోపిస్తూ ఆయన్ని ఉద్యోగంలో నుంచి ఊడబీకారు. కాన్పుకి ముందు క్లోరిన్‌తో చేతులు కడుక్కోవటాన్ని బంద్ చేశారు. చివరికి సెమెల్వీస్‌ను ఒక పిచ్చాసుపత్రిలో చేర్చారు. అప్పట్లో మానసిక వైద్యమంటే గొడ్డును బాదినట్టు బాదటమే.. ఆ దెబ్బలకు తాళలేక సెమెల్వీస్ 46ఏళ్ల వయసులో మరణించారు. ఆ తర్వాత లూయీ పాశ్చర్ వంటి వారు సూక్ష్మక్రిములను గుర్తించటం, సెమెల్వీస్ చెప్పిందే కరెక్టనటం, పెన్సిలిన్ వంటివి అందుబాటులోకి రావటం తెలిసిందే.

కేవలం కామన్‌సెన్స్‌తో మానవాళికి మేలుచేసేందుకు ఒక డాక్టర్ చెప్పిన సలహాను, సాటి డాక్టర్లే తోసిపుచ్చారంటే .. ఇక సామాన్య ప్రజలు ఒక సూత్రాన్ని అర్థం చేసుకుని ఆచరణలోకి తేవటానికి ఎన్ని అవరోధాలుంటాయి!. అలాగే సెమిల్వీస్ చెప్పిన 'ముందుగా చేతులు కడుక్కోండి' అనే చిన్న సూచన శతాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఆచరణలోకి రాలేదంటే.. రాజకీయం, పాలనా సంస్కరణలకు ఎంతకాలం పట్టచ్చో ఆలోచించండి!! అప్పటికంటే ఇప్పటికి కొంత పరిజ్ఞానం, సాంకేతికత పెరిగి ఉండొచ్చు. కానీ మానవ మనస్తత్వంలో, సామాజిక ధోరణుల్లో మార్పు అనేది చాలా సంక్లిష్ట, సుదీర్ఘ ప్రక్రియ. టెక్నాలజీని తెచ్చినంత ఈజీగా మనిషిలో మార్పుని తేలేం. లోక్‌సత్తా ఎన్నికలలో ఓడిపోతే.. ఎన్నికై అధికారంలోకి వచ్చినవారికంటే కూడా అనేకరెట్లు ఎక్కువగా లోక్‌సత్తా సాధించిన విజయాలను సైతం మర్చిపోయి మాట్లాడేవారంతా గుర్తించాల్సిన అంశమిది!

డా॥ ఇగ్నజ్ సెమిల్వీస్ చెప్పిన చేతులు శుభ్రం చేసుకోవటమనే వ్యక్తిగత పారిశుద్ధ్యాన్ని పాటించటానికి ఇష్టపడనివారు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లమంది ఉన్నారు. అందులో భారతీయులు చాలా పెద్దసంఖ్యలోనే ఉన్నారు. ప్రజలకు సరైన విద్యను అందించకపోవటం, వైద్యాన్ని అందుబాటులోకి తేకపోవటంతోపాటు, ప్రజలు ఇంగితజ్ఞానంతో తమ జీవితాల్ని చక్కదిద్దుకునేందుకు కావలసిన స్థానిక ప్రభుత్వాలను పటిష్టం చేయకపోవటం వల్ల ఏటా



లక్షలమంది మనదేశంలో పారిశుద్ధ్య సంబంధ వ్యాధులతో మరణిస్తున్నారు. స్వచ్ఛ భారత్ అందుకే గదా అనుకోవచ్చుగానీ.. అది పేరు గొప్ప, ఫలితం దిబ్బలాగానే కొనసాగుతోంది. ప్రధానమంత్రి, ప్రముఖుల ప్రచారం చుట్టూనే తప్ప స్థానిక ప్రజల శక్తిసామర్థ్యాల వినియోగం చుట్టూ డిజైన్ చేయకపోవటం వల్ల స్వచ్ఛ భారత్ మంచి పథకమే అయినా, ఆశించిన ఫలితం సాధించటం లేదు. పారిశుద్ధ్యం, తాగునీరు లక్ష్యాలు నీరుగారిపోతుండటంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా మళ్లీ భారత్ సహా పలు దేశాలను హెచ్చరించింది.


## 200కోట్ల మందికి కలుషిత నీటి వనరులే ఆధారం

నేడు ప్రపంచవ్యాప్తంగా 200కోట్ల మంది ప్రజలు.. మలంతో కలుషితమైన నీటివనరులపైనే ఆధారపడి ఉన్నారని, దీనివల్ల కలరా, నీళ్ల విరేచనాలు (డయేరియా), టైఫాయిడ్, పోలియో వంటి వ్యాధుల ముప్పును ఎదుర్కొంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ రూపొందించిన 'యూఎన్- వాటర్ గ్లోబల్ ఎనాలిసిస్ అండ్ ఎసెస్మెంట్ ఆఫ్ శానిటేషన్ అండ్ డ్రింకింగ్ వాటర్ (గ్లాస్)-2017' నివేదిక పేర్కొంది. 2030 నాటికి అందరికీ సురక్షిత నీరు, పారిశుద్ధ్య సేవలు అందాలన్న 'నిరంతర అభివృద్ధి లక్ష్యాల' (ఎస్డీజీ)ను చేరుకోవాలంటే కేటాయింపులు సహా చర్యలు పెంచాలని స్పష్టం చేసింది. కలుషిత నీటిని తాగటం వల్ల డయేరియా తలెత్తి ఏటా 5లక్షలమందికి పైగా మృత్యువాత పడుతున్నారని తెలిపింది. పేగుల్లో పురుగులు చేరటం, ట్రకోమా (కంటి ఇన్ఫెక్షన్) వంటి ఉష్ణమండల వ్యాధులకూ ఇది కారణమవుతున్నట్టు వివరించింది. తాజా నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు:

- నీరు, పారిశుద్ధ్యంపై పెట్టుబడులు పెంచడం వల్ల ఆరోగ్యం, అభివృద్ధి, ఉపాధి కల్పన, పౌష్టికాహారం, విద్య వంటి అంశాలపై గణనీయస్థాయిలో సానుకూల ప్రభావం ఉంటుంది.
- కానీ, తాగునీరు, పారిశుద్ధ్యానికి బడ్జెట్ కొరత ఎక్కువగా ఉంది. మరింత సమర్థంగా ఆర్థికవనరులను వినియోగించటం, నిధులకు సంబంధించి కొత్త మార్గాలను గుర్తించటం తక్షణావసరం. పన్నులు, రుసుములు, దాతల విరాళాలు వంటి వనరుల నుంచి నిధులను అందించటానికి సమన్వయంతో కూడిన వినూత్న చర్యల గురించి ఆలోచించాలి.
- గత మూడేళ్లలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై దేశాలు సరాసరిన ఏటా 4.9శాతం మేర కేటాయింపులను పెంచాయి. అయినా జాతీయ లక్ష్యాలను అందుకోవటానికి ఈ వ్యయం సరిపోవటం లేదని 80శాతం దేశాలు చెబుతున్నాయి.
- ప్రపంచానికి ఎస్డీజీ లక్ష్యాలను అందుకోవటానికి మౌలికవసతుల్లో పెట్టుబడులు మూడింతలు పెరిగి.. ఏటా 11,140 కోట్ల డాలర్లకు చేరుకోవాలన్నది ప్రపంచ బ్యాంకు అంచనా. నిర్వహణ ఖర్చులు దీనికి అదనం.
- వినియోగదారులపై విధిస్తున్న రుసుములు.. నిర్వహణ ఖర్చులకూ సరిపోవటం లేదని సగానికిపైగా దేశాలు పేర్కొన్నాయి.
- నీరు, పారిశుద్ధ్యంపై అధికారిక అభివృద్ధి సాయం (ఓడీఏ) కింద నిధుల విడుదల పెరుగుతోంది. 2012లో అది 630 కోట్ల డాలర్లు ఉండగా, 2015నాటికి 740కోట్లకు చేరింది. భవిష్యత్ కేటాయింపులకు సంబంధించిన హామీలు మాత్రం తగ్గిపోతున్నాయి. 2012లో అది 1004 కోట్ల డాలర్ల మేర ఉండగా.. 2015లో 820 కోట్ల డాలర్లకు పడిపోయింది.
- నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత సేవలను పేదలకు అందించడం విధానపరమైన ప్రాధ్యమంగానే ఉంది. 70శాతానికిపైగా దేశాలలో దీనిపై విధానాలున్నాయి. కానీ ఫలితాలు సాధించటానికి తగ్గట్టు లేవు.

# కళాశాలల్లో 'సి' చిచ్చు

వ్యక్తుల చుట్టూ తిరుగుతున్న భారత రాజకీయాల్ని 'ప్రజలు కేంద్రంగా వ్యవస్థల చుట్టూ' తిరిగేలా మార్చేందుకు సంస్కరణోద్యమాన్ని నిర్మించేలా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌కు ప్రేరణనిచ్చింది గుంటూరు వైద్య కళాశాల క్యాంపస్. ఎమర్జెన్సీ అందుకు నేపథ్యం. వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనివ్వటం ఈ సంస్కరణోద్యమ మౌలిక లక్ష్యాల్లో ఒకటి. అయితే, ఇటీవల అదే గుంటూరు వైద్య కళాశాల క్యాంపస్‌లో ుల వివక్షపై ఓ విద్యార్థిని ఆయనకే ఫిర్యాదు చేసింది. కళాశాల స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గన్న జేపీని కలిసి తన ఆవేదన చెప్పుకుంది. సభలో ఆ విషయాన్ని ప్రస్తావించాలని కోరింది.




కుల రాజకీయాలకు ఆలవాలమైన ఆంధ్రప్రదేశ్.. రాష్ట్ర విభజన తర్వాత కూడా పద్ధతుల్ని మార్చుకోలేదు. పాలకపక్షం, ప్రతిపక్షం కూడా విభజనను ఒక అవకాశంగా మలచకుండా.. కులాధిపత్య ధోరణులతో, ఆడంబరాలతో, కుల సమీకరణలతో వ్యవహరిస్తున్నాయి.

ఏపీలోని కుల ఆధిపత్యాన్ని, కుల రాజకీయాలను పలుమార్లు తీవ్రంగా విమర్శించిన జేపీ.. కుల వివక్ష నుంచి పూర్తిగా విముక్తిని సాధించి అందరికీ ఎదిగే అవకాశాలు లభించటానికి రిజర్వేషన్లు సహా ఏయే అంశాలలో ఏం చేయాలో చాలా స్పష్టంగా వివరించారు. ఓ రాజకీయోద్యమ వ్యవస్థాపకునిగా, పౌరునిగా ఆ పరిష్కారాలను తనవంతు ఆచరణలో చూపుతున్నారు. వివక్ష తొలగింపునకు కీలకమైన 'నాణ్యమైన విద్య'ను రాజకీయానికి కేంద్ర బిందువు చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్ర విభజన జరిగాక కూడా కులాధిపత్యంతో కొందరు ప్రవర్తిస్తున్న తీరుపై రిషితేశ్వరి ఆత్మహత్య వంటి సందర్భాలలో తీవ్రంగా హెచ్చరించారు. కుల గజ్జిగాళ్లకు వ్యతిరేకంగా జేపీ మెస్సేజ్ వీడియో.. రికార్డుస్థాయిలో వైరల్ అయింది. కానీ కుల ధోరణుల్ని పాలక, ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా డబ్బు వెదజల్లి మరీ ప్రోత్సహిస్తుండటం వల్ల వాటికి కళ్లెం పడటం లేదు. విద్యాసంస్థలోనూ పెచ్చరిల్లుతున్నాయి.

2018-19 ఎన్నికల్లో కుల కాలుష్యం పెద్దఎత్తున ఆంధ్రప్రదేశ్‌ను (తెలంగాణను సైతం) అనారోగ్యం పాలుచేయనుందని పలు తాజా పరిణామాలు హెచ్చరిస్తున్నాయి.

లోక్‌సత్తాకు అందిన ఫిర్యాదులు, నివేదికలు, మీడియాలో వచ్చిన విశ్వసనీయ వార్తల ఆధారంగా ఏపీ కళాశాలల్లో కులచిచ్చు ఇలా పేట్రేగుతోంది..

**గుంటూరు, విజయవాడ విద్యాలయాల్లో మరీ అధికం**

నవ్యాంధ్రలోని ఇతర జిల్లాలోనూ కులపిచ్చి ఉన్నా.. రాజధాని అమరావతి ఉన్న గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో మరీ ఎక్కువగా కనిపిస్తోంది. యువత మనసుల్ని వికసింప చేసి ఉత్తమ పౌరులుగా తయారుచేయాల్సిన విద్యాసంస్థలు కులాల కుమ్ములాటలకు నిలయాలుగా మారుతున్నాయి. గుంటూరు, విజయవాడల్లోని కొన్ని కళాశాలలైతే పూర్తిగా ఈ కులం వారివే, ఆ కులం వారివే అనే ముద్రతో ఉన్నాయి. పాఠశాలలో పెద్దగా కులం గురించి తెలియనివారు కూడా ఈ కాలేజీల్లోకి




వచ్చేసరికి.. కులాల గజ్జిని అంటించు కుంటున్నారు. అక్కడున్న కుల రాజకీయ శక్తులు వారిని కులాలవారీగా విభజించేసి వేడుక చూడటం, పబ్బం గడుపుకోవటం చేస్తున్నారు.

కొన్ని కాలేజీల్లో విద్యార్థులను ఇంటి పేరుతోనే పిలుస్తుంటారు. తప్పేం లేదుగదా అనిపించొచ్చుగానీ.. కులానికి సంకేతంగానే, ఓ సామాజిక వర్గానికి గౌరవంలా అలా పిలుస్తారని తెలిస్తే అవాక్కవ్వాల్సిందే. కళాశాలలో కొత్తగా విద్యార్థి అడుగుపెడితే ఎదురయ్యే మొదటి ప్రశ్న – 'మీ ఇంటి పేరు ఏంటి, మీది ఏ కులం?'. సమాధానం చెప్పటం ఆలస్యం.. ఇక ఆ విద్యార్థి ప్రమేయం లేకుండానే ఆ సామాజికవర్గంలో చేరిపోవాల్సిందే. మరుక్షణం నుంచి ఆ విద్యార్థి మిగిలిన సామాజికవర్గం వారితో మాట్లాడకూడదు. ఒక కులం అమ్మాయి మరో కులం కుర్రాడితో మాట్లాడటానికి అసలు వీల్లేదు. ఎవరైనా ఈ నిబంధనలను మీరితే ఇక అంతే. ఆ అబ్బాయిపైన ఆమె సామాజిక వర్గం విద్యార్థులు దాడులు చేస్తారు. ఈ గొడవలు హత్యలకు దారితీసిన ఉదంతాలు అనేకం విజయవాడలోనే ఉన్నాయి.

**మా కులం - మా బెంచీ**

కొన్ని ప్రముఖ కళాశాలల్లోని తరగతి గదుల్లో విద్యార్థులు సామాజికవర్గాలుగా విడిపోయి ఒకవైపు వరసలో కూర్చుంటుంటారు. ఏ కులం విద్యార్థులు ఆ కులం విద్యార్థులతో కలసి ఒకే వరస బెంచీల్లో కూర్చోవాలి. చాలాఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోందని, దీన్ని బ్రేక్ చేస్తే ఊరుకోమని బెదిరిస్తున్నారు.

**సి.. పార్టీలు**

ఓ ప్రముఖ తెలుగు దినపత్రిక అమరావతి డేట్‌లైన్‌తో ప్రచురించిన వార్త ప్రకారం.. విద్యార్థుల్లో కులపిచ్చి ఏ స్థాయిలో ఉంటుందంటే ఏకంగా 'కులం' పార్టీలు నిర్వహించేంతగా. వాటి ముద్దుపేరు 'సి' పార్టీలు. ఈ పార్టీలకు అన్ని కళాశాలల్లోని ఆయా సామాజికవర్గం విద్యార్థులు హాజరవుతారు. ఆ కులం రాజకీయనేతలు వస్తారు. ఎన్నికల సమయంలో అయితే కొంతమంది నేతలు డబ్బు ఖర్చుపెట్టి మరీ వాటిని ఏర్పాటు చేయిస్తున్నారు.

**హాస్టళ్లలో ఓ అంతస్తు వారికే..**

హిందూ మతంలోని కులవ్యవస్థ నిచ్చెనమెట్లలా ఉంటుంది. అంటే, ఒకరు పైన ఉంటే, ఇంకొకరు కింద. అలాగే అగ్రవర్ణాలుగా పిలుస్తున్నవారికి పైన ఒక అంతస్తును సైతం కొన్ని హాస్టళ్లలో కేటాయిస్తున్నారు. ఇక వారు మిగిలినవారితో కలవరు, మాట్లాడరు. కొన్నిసార్లు వారితో కలిసి మెస్‌లో కూడా భోంచేయరు.

**కులం 'మార్కు'లు**

ఓ విశ్వవిద్యాలయంలో రిషితేశ్వరి విషయంలో ఎలా ప్రవర్తించారో అలా వ్యవహరించే గురువులు కళాశాలల్లో లెక్కకు మిక్కిలిగా ఉన్నారు. మార్కులు వేయటంలో తమ కులం 'మార్కు' చూపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కులాల కోలాటంలో భాగంగా.. ఇతర

సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులు కొంతమందిని కావాలనే తరువాతి సంవత్సరంలోకి వెళ్లకుండా ఆపేస్తున్నారని బలమైన విమర్శలున్నాయి. గుంటూరులోని ఓ ప్రముఖ కళాశాలలో ఒకే సామాజిక వర్గంవారినే అధ్యాపకులుగా, విభాగాధిపతులుగా నియమిస్తుంటారు. అక్కడ ఆధిపత్యం కూడా ఆ కులం విద్యార్థులదే.

**ఆటస్థల విభజన**

సినిమా యాక్టర్ల కులాల్ని బట్టి పోస్టర్లు అంటించటం, చించటం చేసే గోదావరి జిల్లాలోని ఓ డిగ్రీ కళాశాలలో ఏకంగా ఆటస్థలాన్ని కూడా కులాలవారీగా విభజించుకున్నారు. అమలాపురం, పిఠాపురం వంటి చోట్ల విద్యాసంస్థల్లో కులాలవారీ చీలికలు మరీ భయంకరంగా ఉన్నాయి.

**అమ్మాయిలు మాట్లాడితే గొడవే**

కుల సంస్కృతి కళాశాలల్లో అమ్మాయిలు ఇతర సామాజికవర్గం అబ్బాయిలతో మాట్లాడకూడదు. అలా ఎప్పుడైనా మాట్లాడితే గొడవలు జరుగుతుంటాయి. తోటి విద్యార్థులతో మాట్లాడకపోవటం ఇబ్బందికరమే అయినా.. ఎందుకొచ్చిన గొడవలే అని పలువురు అమ్మాయిలు సర్దుకుపోతుంటారు.

**విశ్వ విద్యాలయాల గురించీ చెప్పనక్కర్లేదు**

రాష్ట్రంలో కొన్ని విశ్వవిద్యాలయాల ప్రాంగణాలు పూర్తిగా కులంతో కుళ్లిపోయాయి. తరగతి బెంచీ దగ్గర్నుంచి హాస్టల్ గదుల కేటాయింపు వరకూ కులాలే ఇక్కడ చెలాయిస్తాయి.

**డాక్టర్లే కులం పేషెంట్లు**

డాక్టర్లకే చికిత్స అవసరమైనస్థాయిలో కొన్ని వైద్యకళాశాలల్ని కులం జబ్బు పట్టిపీడిస్తోంది. వైద్య విద్యార్థులు కూడా సామాజికవర్గాలుగా విడిపోయారు. కులాలపేరిట వాట్సాప్ గ్రూప్‌లు నిర్వహిస్తున్నారు. ఓ వైద్యకళాశాల అనుబంధ ఆసుపత్రిలో అయితే వైద్యవిద్యార్థులు, వారికి పాఠాలు బోధించే అధ్యాపకులు రోగిని అడిగే మొదటి ప్రశ్న 'నీదే కులం'.

చుట్టూ వున్న విద్యార్థులు, అధ్యాపకులు ఒకే కులం వారు ఉండటం ఆనవాయితీలా సాగుతున్నందున ఇతర కులాల విద్యార్థులకు వేరే మార్గం లేదు. కళ్లు మూసుకుని చదువు పూర్తి చేసేసుకోవాల్సిందే. యువతలోని దూకుడును, భావోద్రేకాలకు ఆకర్షితులయ్యే ధోరణిని అవకాశంగా తీసుకుని రాజకీయ నాయకులు కులాన్ని ఓ మత్తులా ప్రయోగిస్తున్నారు. వంగవీటి, దేవినేని వారు విద్యార్థులను కులాలవారీగా ఉపయోగించుకుని ఎదిగారు. ఆ తర్వాత ఆర్థిక సంస్కరణల ప్రభావంతో కొంత మార్పు వచ్చినా.. విద్యాప్రమాణాలు మెరుగుపడకపోవటం, కళాశాలలు, యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో పెరగటం, మొబైల్ సోషల్ మీడియా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో రాజకీయ నాయకులు పెద్దఎత్తున యువ 'కుల' రాజకీయాలు చేస్తున్నారు. మద్యం, గంజాయి వంటి వాటితోపాటు కులం మత్తుమందుతో వారిని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారు. తల్లిదండ్రులు, చుట్టూ ఉన్న సమాజంలో కూడా కులం, పార్టీ, ప్రాంతం వంటి భావాలే ఆధిపత్యం వహిస్తుండటంతో యధాతథ స్థితి కొనసాగుతోంది. చదువుకునే సమయంలో కుల బలప్రదర్శనలకు, హీరోల బ్యానర్లు కట్టటానికి కాలం వెచ్చించి చివరికి ఎందుకూ కొరగాకుండా రోడ్ల మీద తిరుగుతున్న లంపేన్ యువత విజయవాడలో పెద్ద సంఖ్యలో కనిపిస్తుంటారు.

కులరహిత సమాజాన్ని, సమతావాదాన్ని బోధించిన బుద్ధుడు, అంబేద్కర్‌ల విగ్రహాలను పెట్టుకున్న చోటే కుల వివక్ష, అణచివేత విస్తరిస్తున్నా సాగుతున్నా స్పందించలేని ప్రభుత్వం.. కులరహిత ఆంధ్రప్రదేశ్‌ను సాధించటానికి ఇప్పట్లో ఏమాత్రం ప్రయత్నం చేసే అవకాశం లేదు. ఓట్లు, సీట్లు పొందుతున్న ఇతర పార్టీలు కూడా అధికార తెదేపా తానులో గుడ్డల్లాగానే వ్యవహరిస్తూ కులం చుట్టూనే రాజకీయం యధాశక్తి చేస్తున్నాయి కాబట్టి పరిస్థితి మరీ జటిలంగా మారింది. ఆ పార్టీలన్నీ కళాశాలల్ని తమ కులరాజకీయాలకు వేదికలుగా ఉపయోగించుకుంటున్నాయి. అణగారిన కులాలను మోసం చేస్తున్న ఆ కులాలకే చెందిన కొందరిని నాయకులుగా ప్రమోట్ చేస్తూ కులచిచ్చును పెంచుతూ ఓట్లు దండుకుంటున్నాయి. మహాత్మాపూలే, అంబేద్కర్ వంటి వారిని కులనాయకుల పాత్రకు, రిజర్వేషన్లకు పరిమితం చేస్తూ.. వారు ఆశించిన నాణ్యమైన విద్యను మాత్రం అందించకుండా కులాన్ని ఇంకా ఇంకా పెంచేలా వ్యవహరిస్తున్నాయి. యువతలో కాస్త ఆలోచనాపరులు, పౌర సమాజం, మీడియాలో కొందరైనా బలమైన సంకల్పంతో.. కులరహిత సమాజం, రాజకీయం దిశగా ప్రజల్ని మేలుకొలిపే బాధ్యతను తీసుకోవటమే ఇప్పుడు చేయాల్సిన పని. ●

వైద్యం దైవకార్యమని, కానీ వైద్యరంగం ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల పేద, మధ్య తరగతివారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ పరిస్థితికి పాలకులే ప్రధానకారణమన్నారు. ప్రజారోగ్యంపై పాలకులకు అవగాహన లేకపోవటం వల్ల.. సమర్థులైన వైద్యులున్నా మనదేశంలో మంచి ఫలితాలు రావటం లేదన్నారు.

కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల స్నాతకోత్సవానికి జేపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దాదాపు 150మంది ఎంబీబీఎస్ పట్టభద్రులకు పట్టాలు అందచేశారు.



# వైద్యం .. దైవకార్యం

జాతీయ నివేదికల ప్రకారం ఏటా 12లక్షలమంది ఐదేళ్లలోపు చిన్నారులు నివారించదగ్గ అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నారని, ఆసుపత్రికి వెళ్తే ఆర్థికభారం తాళలేక పలువురు నిరుపేదలు రోగాలతో కన్ను మూస్తున్నారని జేపీ అన్నారు. కొన్ని లక్షలమంది అంగవైకల్యంతో బాధపడుతున్నారన్నారు. ఆదాయంలో 75శాతాన్ని కేవలం ఆసుపత్రులు, మందులకే వెచ్చిస్తూ వైద్యం చేయించుకోలేని దుస్థితిని ఎదుర్కొంటున్నవారు ఈ దేశంలో పలువురు ఉన్నారన్నారు.

భావి వైద్యులుగా స్థిరపడనున్న విద్యార్థులంతా సేవ, అంకితభావంతో పనిచేయాలని, ప్రతికూల పరిస్థితుల్లో కూడా తమ వద్దకు వచ్చే రోగులకు ఆర్థికభారం లేని సేవలను అందించాలని జేపీ అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్యసేవలందించేందుకు యువ వైద్యులు ఆసక్తి చూపాలన్నారు. ప్రతి తరం ముందుతరం కంటే గొప్పతరం అవుతుందని, పట్టా తీసుకుని వెళుతున్న ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో వృత్తిని కొనసాగించాలన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు వైద్యుడే దైవంతో సమానమని, ఏ వ్యాధికి ఏ మందు వాడాలో వైద్యులకు స్పష్టత ఉండాలన్నారు. దేశాన్ని బట్టి సైన్స్ మారదని, ఏ దేశంలోనైనా సైన్స్ ఒక్కటే, యూనివర్సల్ సైన్స్ అన్నారు. మరుగునపడిపోతున్న విషయాలను బయటకు తీసుకొచ్చి సమాజానికి తెలియచేస్తుండాలన్నారు. దేశంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనకర మందులను తయారు చేయాలన్నారు. అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించి భారతీయ వైద్యసేవలు ప్రపంచానికే తలమానికం కావాలన్నారు. దేశంలోనే రంగరాయ కళాశాలక మంచి గుర్తింపు ఉందని, ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో దేశవిదేశాల్లో ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. ఆంగ్లం మోజులో పడి మాతృభాషను విస్మరించవద్దని అన్నారు.

ప్రిన్సిపల్ డా॥ ఆర్.మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ అవధాని గరికపాటి నరసింహారావు, వైస్ ప్రిన్సిపల్ డా॥ కృష్ణప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా॥ కె.బాబ్జీ, జీజీహెచ్ పర్యవేక్షణాధికారి ఎం.రాఘవేంద్ర రావుతోపాటు ఎం.వి ఆనంద్, ఎస్.వి లక్ష్మీనారాయణ, జి. శేషగిరిరావు, లక్ష్మోజీనాయుడు, స్పర్జన రాజు. సౌభాగ్యలక్ష్మి. టి. రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం .. కొయ్ రాజా కొయ్ !

ఏప్రిల్ 2014నాటి ధరల ప్రకారం సాగునీటి ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం పెరిగితే ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భర్తీ చేయాల్సి ఉంటుంది" అని స్పష్టంచేశారు. దీంతో.. పోలవరం అథారిటీని పక్కకు నెట్టి, నిర్మాణ బాధ్యతలను చేజిక్కించుకుని అంచనా వ్యయాన్ని రాత్రికి రాత్రే రూ.40,351 కోట్లకు పెంచిన చంద్రబాబు సర్కారుకు పెద్ద సమస్య ఎదురైంది. నామినేషన్లపై సబ్‌కాంట్రాక్టర్లకు పనులు అప్పచెప్పి కమీషన్లు తీసుకుంటూ నత్తనడకన పనులు చేస్తున్న పాలకులకు కేంద్ర ప్రకటన ఇరకాటంగా మారింది. విభజన జరిగిన నాటి నుంచి పోలవరంపై గట్టిగా పోరాడి సాధించకుండా తాత్సారం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు కూడా కేంద్రం ఆలస్యం వల్లే ఇలా ప్రాజెక్టు అంచనాలు పెరిగాయని, కేంద్రమే చెల్లించాలని మోదీ ప్రభుత్వాన్ని నిలదీయలేకపోతున్నారు. కేంద్రం ఇచ్చే నిధులుపోగా మిగిలిన వేల కోట్లు ఎక్కడనుంచి తీసుకొస్తారో చెప్పలేక పోతున్నారు. 2019నాటికల్లా పోలవరం పూర్తవుతుందా, లేదా? అనేది భారీ బెట్టింగ్ స్థాయి ప్రశ్నలా మారిపోయింది.



## ప్రారంభ అంచనా రూ.10వేల కోట్లు

జలయజ్ఞంలో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2005లో ప్రారంభమైంది. కుడి, ఎడమ కాలువలు, స్పిల్ వే, రాక్‌ఫిల్ డ్యాం, అనుబంధ పనులను ప్యాకేజీలుగా విభజించి పనులను ఖరారు చేశారు. 2005-06 ధరల ప్రకారం ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయ అంచనా రూ.10,151.05కోట్లు. ఈ ప్రాజెక్టుకు 2009లో జనవరిలో కేంద్ర జలసంఘం నుంచి సాంకేతిక అనుమతి, అదే ఏడాది ఫిబ్రవరిలో ప్రణాళికా సంఘం నుంచి పెట్టుబడి అనుమతులు వచ్చాయి. ఈ పథకానికి జాతీయహోదా కల్పించాలంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీ అందుకు సిఫార్సు చేసింది. అయితే ఆర్థిక శాఖలోని వ్యయాల కమిటీ తాజా ధరలతో అంచనాలు పంపాలని కోరింది. 2010-11 ధరలను పరిగణలోకి తీసుకుని రూ.16,011 కోట్లతో ప్రతిపాదనలు పంపినా, కేంద్రం పక్కనపెట్టింది.

అంతర్రాష్ట్ర బహుళార్థ సాధక పోలవరం ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2019 ఎన్నికల ఆశల్ని పెట్టుకున్నారు. కానీ ఆ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న తీరు చూస్తున్న నిపుణులకు కూడా పలు అనుమానాలు కలుగుతున్నాయి. పోలవరాన్ని ప్రాజెక్టులాగా కాకుండా బ్యారేజీలా పూర్తి చేసి ప్రజలను మభ్యపెడతారని వ్యాఖ్యానిస్తున్నారు. పట్టిసీమ మొదలుపెట్టినప్పుడే పోలవరం ప్రశ్నార్థకమైంది, పోలవరం పూర్తయితే అసలు పట్టిసీమ అనవసరం లేదు గదా అని వారంటున్నారు. 'పట్టిసీమ ఎందుకు కట్టారో కూడా అర్థం కావటం లేదు, తలాతోకా లేని లక్ష్యంతో కట్టినట్టుంది' అని 'కాగ్' కూడా కడిగేసిన సంగతి తెలిసిందే. 'పోలవరం ప్రాజెక్టును ముట్టుకుంటే పదవీ గండం తప్పదనే సెంటిమెంట్ వల్ల పట్టిసీమ కట్టారు, ఈ మాటల్ని బహిరంగంగా చెప్పలేం గదా' అని తెలుగు తమ్ముళ్లు, అధికారులు వేసుకునే జోక్‌లు మినహా వీటి మీద చంద్రబాబు ప్రభుత్వం సూటిగా స్పందించటం లేదు. పోలవరం 2019లోగా పూర్తి చేస్తామనే చెప్పుకుంటూ వస్తున్నారు. కాంగ్రెస్ నుంచి తెదేపాలోకి

## కేంద్రం కన్ను

పారదర్శకత, జవాబుదారీతనం లేకుండా అయోమయంగా తయారైన పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల మరో కమిటీని నియమించింది. కేంద్ర జలసంఘం సభ్యుడు మస్సూద్ అహ్మద్ నేతృత్వంలో అయిదుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. వీరితోపాటు నలుగురు చీఫ్ ఇంజినీర్లు కూడా ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే ప్రాజెక్టు డిజైన్ల సమీక్షకు నియమించిన కమిటీ ఛైర్మన్, అందులోని కొందరు సభ్యులు ఈ కమిటీలో ఆహ్వానితులుగా ఉన్నారు. గతంలోనూ కేంద్రం పోలవరం పనులపై ఒక కమిటీని నియమించిన విషయం తెలిసిందే. అప్పట్లో అది పోలవరం ప్రాజెక్టును, కాలువ పనులను పరిశీలించి కేంద్రానికి నివేదిక సమర్పించింది. ఈ కమిటీ నివేదిక ప్రకారమే, కేంద్ర జలసంఘం విశ్రాంత ఛైర్మన్ పాండ్యా నేతృత్వంలో డిజైన్ల సమీక్ష కమిటీ ఏర్పాటైంది. ఇప్పుడు మరో కమిటీ ఏర్పాటు పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

వచ్చిన రాయపాటి సాంబశివరావుకి చెందినదిగా చెబుతున్న ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ పనితీరు అధ్వాన్నంగా ఉందని అధికారులు చెబుతున్నా, చంద్రబాబు వినిపించుకోకుండా ఆ కంపెనీనే కొనసాగిస్తున్నారు, 2019 పాటనే వినిపిస్తున్నారు. ఏపీలో యువత ఉద్యోగాలకు కీలకమైన ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టటానికి.. పోలవరం వేగంగా పూర్తిచేస్తామని కేంద్రం నుంచి హామీ ఇవ్వటమే కారణమని చంద్రబాబు స్వయంగా చెప్పినా ప్రజలు నమ్మటం లేదు. ప్రత్యేక తరగతి హోదా, ఉమ్మడి ఆస్తుల విభజన, కేంద్ర ప్రాయోజిత పథకాల సొమ్మును పూర్తిగా రాబట్టటం, పోలవరం విషయంలో చంద్రబాబు మెతకవైఖరి వల్ల వేల కోట్లు రాష్ట్రానికి నష్టం వచ్చిందనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. ప్రతిపక్ష నేత పట్ల వివిధ వర్గాల్లో మరీ ఎక్కువ అపనమ్మకం ఉండటం వల్ల మాత్రమే అధికార పార్టీ కొంత ఊపిరి పీల్చుకోగలుగుతోంది. కేంద్రంతో చంద్రబాబు మెతక వ్యవహారశైలిపై ప్రజల్లో ఉన్న అనుమానాల్ని పోలవరం నిర్మాణంపై ఇటీవల కేంద్ర జలవనరుల మంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటన మరింత పెంచింది.

పోలవరం అంచనాలను ఎంత పెంచినా, పాత అంచనాలమేరకే పోలవరం ప్రాజెక్టుకు నిధులిస్తామని కేంద్ర జలవనరుల మంత్రి రాజ్యసభలో చెప్పారు. “2016 సెప్టెంబర్ 30వ తేదీన కేంద్ర ఆర్థికశాఖ జారీ చేసిన ఆదేశాల ప్రకారం 2014 ఏప్రిల్ 1 నుంచి పోలవరం ప్రాజెక్టులో సాగునీటి విభాగం నిర్మాణానికయ్యే మిగిలిన ఖర్చును 100శాతం కేంద్రమే భరిస్తుంది. ఆరోజుకు సాగునీటి విభాగానికి అయ్యే ఖర్చు వరకే ఇది పరిమితం. ఏప్రిల్ 2014నాటి ధరల ప్రకారం సాగునీటి ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం పెరిగితే ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భర్తీ చేయాల్సి ఉంటుంది” అని

- ★ పోలవరం పూర్తిస్థాయి నీటిమట్టం : 150 అడుగులు
- ★ కనీస నీటిమట్టం : 135 అడుగులు
- ★ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం: 194.6 టీఎంసీలు
- ★ గ్రావిటీ ద్వారా వినియోగసామర్థ్యం (లైవ్ స్టోరేజీ): 75.2 టీఎంసీలు
- ★ ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం నీటి వినియోగం: 273.04 టీఎంసీలు
- ★ పోలవరం ద్వారా కృష్ణాలోకి మళ్లింపు: 80 టీఎంసీలు
- ★ ఆయకట్టు: 7.2 లక్షల ఎకరాలు
- ★ విద్యుదుత్పత్తి లక్ష్యం: 960 మెగావాట్లు

స్పష్టంచేశారు. దీంతో.. పోలవరం అథారిటీని పక్కకు నెట్టి, నిర్మాణ బాధ్యతలను చేజిక్కించుకుని అంచనా వ్యయాన్ని రాత్రికి రాత్రే రూ.40,351 కోట్లకు పెంచిన చంద్రబాబు సర్కారుకు పెద్ద సమస్య ఎదురైంది. నామినేషన్లపై సబ్‌కాంట్రాక్టర్లకు పనులు అప్పచెప్పి కమీషన్లు తీసుకుంటూ నత్తనడకన పనులు చేస్తున్న పాలకులకు కేంద్ర ప్రకటన ఇరకాటంగా మారింది. విభజన జరిగిన నాటి నుంచి పోలవరంపై గట్టిగా పోరాడి సాధించకుండా తాత్సారం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు కూడా కేంద్రం ఆలస్యం వల్లే ఇలా ప్రాజెక్టు అంచనాలు పెరిగాయని, కేంద్రమే చెల్లించాలని మోదీ ప్రభుత్వాన్ని నిలదీయలేకపోతున్నారు. కేంద్రం ఇచ్చే నిధులుపోగా మిగిలిన వేల కోట్లు ఎక్కడనుంచి తీసుకొస్తారో చెప్పలేకపోతున్నారు. 2019నాటికల్లా పోలవరం పూర్తవుతుందా, లేదా? అనేది భారీ బెట్టింగ్ స్థాయి ప్రశ్నలా మారిపోయింది. 2018లోనే ఎన్నికలు జరిగితే, ఆ సాకును అడ్డంపెట్టుకుని పోలవరాన్ని దాటవేసే అవకాశాలు కూడా లేకపోలేదని కొందరి వాదన.

# ఉత్తరాంధ్ర యువత ఉపాధిపై నిర్లక్ష్యం



ప్రత్యేకహోదా రాయితీల విషయంలో దెబ్బతీయటమే కాకుండా, ఆ తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయటంలో కూడా ఉత్తరాంధ్ర పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. దీనివల్ల శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎంఎస్ఎన్ మూర్తి, రాజశ్రీ, మొల్లి చిరంజీవి, గౌరీశంకర్, లెక్కల శ్రీనివాస్, నాయుడు వేణుగోపాల్, కృష్ణ, సిరిపురపు శ్రీనివాస్ తదితర నేతలతో కలిసి విశాఖపట్నం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో బాబ్జీ మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రకు ఇచ్చిన 35 హామీల అమలుపై చంద్రబాబు తక్షణం ఎమ్మెల్యేలు, ప్రతిపక్షాలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మూడు జిల్లాల్లో దాదాపు 10లక్షల మంది యువ నిరుద్యోగులు ఉన్నారని, వేలాది కుటుంబాలు పొట్ట చేత పట్టుకుని వలస పోతున్నాయని అన్నారు. ఉత్తరాంధ్రకిచ్చిన హామీల అమలుకు లోక్‌సత్తా ఇప్పటికే విశాఖలో ఆందోళన నిర్వహించిందని.. యువత నిరుద్యోగం, జిల్లాల సమస్యలు, ఈ ప్రాంతం అభివృద్ధిపై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామని బాబ్జీ తెలిపారు.

# కేసీఆర్ ఒంటెద్దుపోకడలను మానుకోవాలి

కేసీఆర్ ఒంటెద్దుపోకడల వల్లే కోర్టుల్లో తరచూ మొట్టికాయలు పడుతున్నాయని, పదవిలోకి రావటానికి ఉపయోగించుకున్న రాజ్యాంగాన్ని పాలనలోనూ గౌరవించాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధిని నిండుమనసుతో కోరుకుంటున్న మేధావులు, సామాజిక కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలన్నారు. మూఢవిశ్వాసాలు, వ్యక్తి ఆరాధనల నుంచి బైటపడి ప్రజలు వాస్తవాలు ఆధారంగా ఆలోచించటం మొదలుపెట్టాలని, తమ జీవితాలు, బిడ్డల భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఈ పురపాలకులపై చర్యలు తీసుకోండి




పన్నులు కట్టమని ప్రజల్ని పీడించుకుతింటున్న మునిసిపల్ శాఖ అధికారులు.. ప్రజలు కనీస పారిశుధ్యం లేకుండా దుర్గంధం మధ్య అల్లాడుతున్నా, కుక్కలు. పందుల తాకిడికి బిక్కుబిక్కుమంటున్నా పట్టించుకోవటం లేదని లోక్‌సత్తా పార్టీ పేర్కొంది. విజయనగరం పురపాలక సంఘం అధికారులు, పాలకవర్గం నేరసమాన నిర్లక్ష్య పాలనపై న్యాయచర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవా సదన్ కార్యదర్శి న్యాయమూర్తి శ్రీహరికి ఫిర్యాదు చేసినట్టు పార్టీ నియోజకవర్గ, పట్టణ అధ్యక్షులు అల్లంశెట్టి నాగభూషణం, మొల్లేటి చిన్నారావు తెలిపారు. ఫిర్యాదు వివరాలను.. లోక్‌సత్తా పార్టీ నేతలు తాట్రాజు రాజారావు, శిమ్మ శ్రీను, బి.భాస్కరుడు తో కలిసి వారు మీడియాకు విడుదల చేశారు.

# ఎట్టకేలకు రహదారి భద్రతా చట్టం

రవాణా రంగంలో గణనీయ మార్పులను తీసుకొచ్చే మోటారు వాహన (సవరణ) బిల్లు 2016ను లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ప్రతిపక్షాలు చేసిన పలు సంస్కరణలను సభ తిరస్కరించింది. నూరుశాతం ఈ-పాలన అమలు, రవాణారంగంలో అవినీతి నిర్మూలన, రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించటం.. తదితర ప్రధానాంశాలను కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బిల్లుపై చర్చ సందర్భంగా సభకు వివరించారు. ఈ-పాలన అమలులోకి వస్తే వాహనాల చోరీలు, బోగస్ డ్రైవింగ్ లైసెన్సులు ఉండవన్నారు. దేశంలో ఏటా 5లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, దాదాపు 1.5లక్షలమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వీరిలో ఎక్కువ యువతేనని అన్నారు. తమ ప్రభుత్వ ఐదేళ్ల పాలన పూర్తయ్యేనాటికి రోడ్డు ప్రమాదాలలో 50శాతంమంది ప్రాణాలను కాపాడగలుగు తామన్నారు. చెక్‌పోస్టుల వద్ద అవినీతిని అరికట్టేందుకు రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. మోటారు వాహన బిల్లు సభ ఆమోదం పొందటం పట్ల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హర్షం వ్యక్తం చేశారు. ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రజల భద్రత, చట్టబద్ధ పాలనకు తొలి ప్రాధాన్యం ఉండాలన్నారు.

# మూఢ మునిసిపల్ కార్పొరేషన్ రూ.2లక్షలు కట్టాలి

ప్రపంచమంతా ధరిత్రి దినోత్సవం జరుపుకుంటుంటే.. చిత్తూరులో, అదీ ప్రభుత్వ కార్యాలయంలో వాస్తు పిచ్చితో నలభైఏళ్ల చింతమాను చెట్టును నరకటం క్షమించరాని నేరమని, దీనికి నగర పాలక కమిషనర్, పాలకవర్గం బాధ్యత వహించి రెండు లక్షల రూపాయలు అపరాధ రుసుముగా తమ జీతం, ఆదాయంలో నుంచి కట్టాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. నియోజకవర్గ స్థానిక సమస్యలపై లోక్‌సత్తా కార్యవర్గ సమావేశం గిరింపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. మునిసిపల్ కార్పొరేషన్ వాస్తు మూర్ఖత్వం ఈ సందర్భంగా చర్చలోకి వచ్చింది. సమావేశంలో నియోజకవర్గ బాధ్యులు రాంబాబు, ముఖ్య కార్యదర్శి శివకుమార్, కార్యకర్తలు భరత్, నగర పౌరులు, టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు హేమంత్, పార్టీ పరిశోధనా విభాగం నుంచి పర్యావరణ నిపుణుడు అనిల్ పాల్గొన్నారు.

# రంగస్థల కళాకారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



విజయనగరం జిల్లాలో దాదాపు 6వేల మంది రంగస్థల కళాకారులున్నారని, కానీ వారు నాటికలు, నాటకాలు, ఇతర కళాప్రదర్శనలు ఇవ్వటానికి మౌలిక సదుపాయాలు అరకొరగా ఉన్నాయని పౌరవేదిక అధ్యక్షుడు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. పట్టణస్థాయిలో కూడా ప్రదర్శనలివ్వటం కష్టమవుతోందన్నారు. స్వచ్ఛందంగా పరిషత్ ప్రదర్శనలిస్తున్న గొప్ప కళాకారులు మన వద్ద ఉన్నారని, వారిని ప్రోత్సహిస్తే సమాజంలో చైతన్యం తేవటానికి అద్భుత ప్రదర్శనలివ్వగలరని అన్నారు. పౌరవేదిక ఆధ్వర్యంలో విజయనగరంలో జరిగిన రంగస్థల కళాకారులు సమావేశంలో బాబ్జీ మాట్లాడారు. గురజాడ కళాభారతికి తక్షణం పైకప్పు వేయాలని డిమాండ్ చేశారు. రంగస్థల కళాకారుల జిల్లా సంఘం ప్రతినిధి అబ్బులు, సీనియర్ నటుడు హృషీకేశం మాట్లాడుతూ, కళాకారులకు, వారి కుటుంబాలకు కనీస చేయూతనిస్తే నాటకం సమాజాన్ని వెలిగిస్తుందన్నారు. సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో చలం, మోహన్, జానకిరాం, డప్పు శ్రీను, జి.త్రినాథ్, ఆచారి, జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి గవర సత్తిబాబు, బాలూ, అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పౌరసేవల చట్టం కోసం పోస్టుకార్డు ఉద్యమం

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా ప్రజలకు హక్కుగా పనులు చేసి పెట్టేందుకు లోక్‌సత్తా రూపొందించిన హక్కుగా 'పౌర సేవల' చట్టాన్ని (ఆర్టీఎస్) అమలు చేయాలని కోరుతూ లోక్‌సత్తా 2.0 ఉద్యమసంస్థ కరీంనగర్ జిల్లాలో పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించింది. సంస్థ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్. శ్రీనివాస్, ప్రకాష్ హాల్లా కరీంగనర్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్టీఎస్ అమలును డిమాండ్ చేస్తూ.. కేవలం తమ జిల్లా నుంచే ఉద్యమసంస్థ 10,000కు పైగా పోస్టుకార్డులను కేసీఆర్ అడ్రస్‌కు పంపుతున్నట్టు వారు తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, లెక్చరర్లు కె.కిషన్‌రెడ్డి, ఎన్.రమాదేవి, లోక్‌సత్తా బాధ్యులు టి.రంగారావు, ఆర్.చంద్రప్రభాకర్, మనోహర్, చందర్, లక్ష్మణ్, కేఎస్ నారాయణ, మునీర్, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలు ప్రజల హక్కు



ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రభువులని, పాలకులు, అధికారులు సేవకులు మాత్రమేనని.. కానీ ఆ పాత్రలు తిరగబడి మనదేశంలో ప్రజలను సేవకుల్లా చేశారని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. 21వ శతాబ్దంలో ఇది సిగ్గుచేటన్నారు. ప్రజలకు హక్కుగా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలందించాలన్నారు. ప్రజలు కట్టే పన్నులకు తగ్గ సేవలు అందించాలన్నారు. ఇందుకోసం పౌర సేవల చట్టం అమలుచేయాలన్నారు. లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల చట్టం (రైట్ టూ సర్వీసెస్- ఆర్టీఎస్)పై అవగాహనా కార్యక్రమాన్ని రాము నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు సత్తయ్య, సీనియర్ నాయకుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

**నల్లకుంటలో ఆర్టీఎస్ బుక్‌లెట్ ఆవిష్కరణ**

పౌర సేవల చట్టంపై ప్రజల్లో, నాయకుల్లో అవగాహన పెంచేందుకు లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం రూపొందించిన బుక్‌లెట్‌ను రాము హైదరాబాద్ నల్లకుంటలో ఆవిష్కరించారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికీ నిర్ణీత గడువు ఉంటుందని, ఆ గడువులోగా పని చేసిపెట్టకపోతే రోజుకు రూ.250కు తగ్గకుండా దరఖాస్తు చేసుకున్న ప్రజలకు పరిహారం చెల్లిస్తారని చెప్పారు. ఆర్టీఎస్.. సమాచార హక్కు చట్టం కన్నా విప్లవాత్మక చట్టమవుతుందన్నారు. తెలంగాణలో గొప్ప పరిపాలన గురించి మాట్లాడే కేసీఆర్ ప్రభుత్వం తక్షణం ఈ పౌర సేవల చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటిదాకా ప్రభుత్వాధికారుల్ని చూసి ప్రజలు భయపడుతున్నారని, ఆర్టీఎస్ అమల్లోకి వస్తే సీన్ రివర్స్ అవుతుందని లోక్‌సత్తా పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షుడు మునిపల్లి వెంకటేష్ అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ ఉపాధ్యక్షురాలు గంగాభవానీ, మురళీకృష్ణ, పేరేచర్ల భవానీ, డి.జీవలత తదితర నేతలు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు కాదు.. ఎన్నికల సంస్కరణలు కావాలి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక జరగాలి: లోక్‌సత్తా




దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిపినంత మాత్రాన రాజకీయం తీరు మారదని, ప్రజలకు మేలు చేసేలా వ్యవస్థను మార్చటానికి నిజమైన ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ముందస్తు, జమిలి వల్ల ఉపయోగం ఉండదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014లో జమిలి ఎన్నికలే జరిగాయని గుర్తుచేశారు. విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు.

ప్రధానమంత్రి మోదీ రాజకీయాలలో మార్పు తీసుకురావాలంటే.. ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానం తీసుకురావాలని, ప్రతి ఓటుకూ విలువనిచ్చే దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలని బాబ్జీ అన్నారు. ఎన్నికల కమిషన్ కోరల్లేని పాములా తయారైందని, ఈసీ విశ్వసనీయతను పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు.

### ముందస్తు ఎన్నికలపై తప్ప.. ప్రజల రక్షణకు ముందస్తు జాగ్రత్తల మీద దృష్టి లేదు


గడచిన నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనే వడగాల్పులకు 4,246 మంది బలయ్యారని, ఈ ఏడాది ఇంకా ఎక్కువమంది మరణించే ప్రమాదముందని బాబ్జీ హెచ్చరించారు. ముందస్తు ఎన్నికల గురించి తప్ప.. ప్రజల రక్షణకు ముందస్తు జాగ్రత్తల గురించి ప్రభుత్వాలకు యోచన లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో వృద్ధులు, పిల్లల రక్షణకు, అన్ని చర్యలూ తీసుకోవాలని, వాతావరణ మార్పులపై కేంద్రప్రభుత్వ సహకారంతో అధ్యయనం చేసి పంట దిగుబడులపై నష్టప్రభావాలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు నాగభూషణం, రమేష్, శ్రీను, అప్పారావు, భాస్కర్, ఎర్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లను సంస్కరించాలి.. పెంచుకుంటూపోవటం దగా రాజకీయమే : లోక్‌సత్తా ధ్వజం

రిజర్వేషన్లను ఆయా కులాల్లోని అర్హులకు అందేలా చేయటంతోపాటు, అవకాశాలు అందుకోలేకుండా ఉన్న ఇతర కులాల పేదలకు అదనపు మార్కులు కలపటం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా.. ఇంకా ఇంకా రిజర్వేషన్లు పెంచుతూ పోవటం దగా రాజకీయమేనని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అల్లేని నిఖిల్ అన్నారు. ముస్లిం రిజర్వేషన్ల పెంపుపై కేసీఆర్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు, అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా, అన్ని వర్గాలనూ మోసం చేసేదిగా, భవిష్యత్ తరాలను దెబ్బతీసేదిగా ఉందన్నారు. రిజర్వేషన్ల పేరుతో సమాజంలో కులమతాల కుంపటిని రగల్చవద్దన్నారు. రిజర్వేషన్లు ఇస్తున్నామంటూ నాణ్యమైన చదువు అందించకపోవటం వల్లే స్వతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా అణగారిన వర్గాల జీవితాలు ఇంకా మెరుగుపడలేదని అన్నారు. రిజర్వేషన్లపై స్పష్టమైన విధానమున్న పార్టీ దేశంలో లోక్‌సత్తా మాత్రమేనని, ఈ రకమైన రిజర్వేషన్ సంస్కరణలతోనే అన్ని వర్గాలతో సామరస్యంగా అణగారినవర్గాలు వేగంగా ఎదగగలవన్నారు. హైదరాబాద్‌లోని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రిజర్వేషన్లపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 94శాతం మేర బడుగు బలహీనవర్గాలవారు ఉన్న తెలంగాణకు నిజంగా మేలుచేయాలనుకుంటే.. రిజర్వేషన్ల సంస్కరణలపై చర్చ చేసి హేతుబద్ధ ఫార్ములాను కేసీఆర్ అమలు చేయాలని అన్నారు.






BE THE CHANGE YOU WISH TO SEE. JOIN THE MOVEMENT
FOR THE YOUTH , BY THE YOUTH & OF THE YOUTH
YOUTH
for better
INDIA
Y.B.I (AP CHAPTER)
LETS BEGIN THE SECOND FREEDOM FIGHT FOR SURAJYA.
for more in AP,contact:
Vizag - Sunil - 8978448762
Vijayawada - Krishna Chaitanya- 8247229434
Guntur - Srinivas - 9014223575
Rajamundry/Kakinada - Uday - 9700769442
Raveendra - 9985501902
Nellore - 9052906668
Tirupati - Nikhil - 9573798369
Bharath 8008526505
Hindupur- Sheik Mujib- 9908484453
*coordinators for other districts will be announced soon


CITY CENTRAL LIBRARY


YOUTH
INDIA
Vizag


YOUTH
for better
INDIA
LOK SATTA

Posting Date 22-05-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on May16th 2017

# అవకాశవాదం నా నైజం కాదు!

మీ పార్టీని మా పార్టీలో కలిపెయ్యండి ...మీకు కేంద్ర మంత్రి వర్గంలో రెండో స్థానమో , మూడో స్థానమో ఇస్తాం -అని కొందరన్నారు

సార్ మీరు డబ్బు మద్యం వంటి విషయాల్లో నా నియోజక వర్గం వైపు చూడకండి ...నాకు పూర్తి స్వేచ్ఛ ఇస్తే సీటు తీసుకొచ్చి మీ కాళ్ళ ముందు పడేస్తా ..లోక్ సత్తాకి కావలసినంత ఫండ్ ఇస్తా - అని ఒకరు

మా రాజకీయ వారసుడికి జై అనండి , మీ సీటు గెలిపించే బాధ్యత మా భుజాలపై వేసుకుంటాం అని ఇంకొందరన్నారు

## ఇలా చేస్తే నేను గెలిచి చేసేదేముంది ?
## లోక్ సత్తా ఎందుకింక ?



ఈ దేశాన్ని మార్చాలనే లక్ష్యం లో భాగంగా రాజీ పడగలను గానీ ఆ లక్ష్యానికి సంబంధం లేకుండా రాజీ పడటం నా వల్ల కాదు .

# నిజాలు మాట్లాడుకుందాం-20

షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad